www.peoplesnews.in

హైదరాబాద్

# పీపుల్స్ న్యూస్

దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 60 బుధవారం, జూలై 15, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో
# విమానాశ్రయాల నిర్మాణం

- ఎంఆర్‌వో, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలి..
- కాకతీయ సంస్కృతికి అద్దం పట్టేలా వరంగల్ విమానాశ్రయం
- ఆదిలాబాద్‌కు అవసరమైన భూ సేకరణచేపడతాం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**న్యూఢిల్లీ,జులై 14 :** తెలంగాణ రాష్ట్రంలో నిర్మించనున్నవరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతోనిర్మించాలని పౌర విమాన యాన శాఖ మంత్రి రామ్మోహన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వ్యూహాత్మకంగా, వాణిజ్య పరంగా వరంగల్, ఆది లాబాద్ విమానాశ్రయాలకు ఉన్న మెరుగైన పరి స్థితులను సీఎం వివరించారు.

మిగతా2లో...

## ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులు
# ప్రారంభించాలి..

## ఫ్యూచర్ సిటీ-బందరు పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ రహదారికి అనుమతులు

- రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయ రహదారి నిర్మించాలి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి



**న్యూఢిల్లీ,జులై 14 :** రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయినందున పనుల ప్రారంభానికి కేంద్ర క్యాబినెట్ అనుమతి ఇప్పించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి గడ్కరీతో ఢిల్లీలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆర్ఆర్ఆర్ రెండువైపులా ఏకకాలంలో పనులు ప్రారంభమైతే నిర్మాణం త్వరగా పూర్తవుందుని, నిర్మాణ వ్యయం తగ్గుతుందని సీఎం తెలిపారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మిస్తామని ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్నందున వెంటనే ఆ రహదారికి అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్‌కు 12 వరుసల రహదారి మంజూరు చేస్తే హైదరాబాద్-విజయవాడల మధ్య 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను బందరు పోర్ట్‌కు సరకు రవాణా వేగవంతమవుతుందని సీఎం వివరించారు. మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి అటవీ

మిగతా2లో...

## ఎన్యూమరేషన్ ఫారాలను
# అందజేయండి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి




**హైదరాబాద్,జులై 14 :** ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా అందజేసిన ఎన్యూరేషన్ ఫారాలను వెంటనే పూర్తి చేసి బిఎల్ఒలకు వెంటనే

మిగతా2లో...

# మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇకలేరు..!



**అమరావతి,జులై 14 :** ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, వైకాపా సీనియర్ నాయకుడు ముద్రగడ పద్మనాభం కాపు ఉద్యమంతో ప్రసిద్ధి చెందిన ముద్రగడ పద్మనాభం ఇకలేరు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన 73 ఏళ్ల వయసులో అందర్నీ విషాదంలో

మిగతా2లో...

## నాణ్యమైన, నిరంతరాయ
# విద్యుత్ సరఫరా

- రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాలు
- ఎర్రవల్లి వద్ద రూ.155 కోట్లతో ఉప కేంద్రం నిర్మాణం
- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క




# సోషల్ మీడియాలో ఇందిరమ్మ ఇండ్ల హవా

- హోం టూర్ వీడియోల హల్ చల్
- ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేస్తాం-
- ఎక్స్ వేదికగా మంత్రి పొంగులేటి






## ఎల్‌నినో పరిస్థితులకనుగుణంగా
# పంటల ప్రణాళిక

**మెట్ట పంటలకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలి**

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**హైదరాబాద్,జులై 14 :** ఈ రోజు నిర్వహించిన 'రైతు నేస్తం' కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. రైతులతో నేరుగా మాట్లాడి వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసు కున్నారు. ఈ ఏడాది తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా వర్షపాతం తక్కువగా నమోదవుతోందన్నారు. దీంతో కృష్ణా, గోదావరి ఆయకట్టు ప్రాంతాల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. భూగర్భ జలాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు సరైన సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయశాఖ, నీటిపారుదల శాఖ, భూగర్భ జలాల శాఖ, భారత వాతావరణ శాఖ అధికారులు సమన్వయంతో

మిగతా2లో...

## ఊరూరా బిఆర్ఎస్
# కుట్రలపై ప్రచారం

- కెసిఆర్ హయంలోనే కూలిన కాళేశ్వరం
- కేంద్ర నిపుణులు సూచనల మేరకు నీటి విడుదల
- మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి




**హైదరాబాద్,జులై 14 :** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం కుంగిపోయిందని బీఆర్ఎస్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి విరుచుకుపడ్డారు. కాళేశ్వరం కూలడానికి కారణం బీఆర్ఎస్ అని ఆరోపించారు. ఊరూరా తిరిగి బీఆర్ఎస్ చేసిన కుట్రలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రక్తం ప్యాకెట్లతో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. ఎన్‌డీఎస్ఏ తుది నివేదిక ఇచ్చి కాళేశ్వరంలో నీటిని నింపమని చెబితే.. వెంటనే నింపుతామని చెప్పారు. ఇంజినీర్లు ఇచ్చిన సలహాలను పాటిస్తామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఉపయోగంలోకి

మిగతా2లో...



## ఆషాఢ బోనాలకు
# భారీగా ఏర్పాట్లు

- భక్తులకు ఇబ్బంది లేకుండా భద్రతా చర్యలు
- నగర పోలీస్ అధికారులతో సజ్జన్నార్ సమీక్ష

**హైదరాబాద్,జులై 14 :** ఆషాడ బోనాల ఉత్సవాలు శాంతియుతంగా, వైభవంగా నిర్వహించడమే లక్ష్యమని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ బోనాలు.. మొదటి 15 రోజులు అత్యంత కీలకమని తెలిపారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. మంగళవారం బంజారా హిల్స్‌లోని టీజీఐసీసీసీలో ఆషాడ బోనాలపై ఆ శాఖ అధికారులతో సజ్జన్నార్ సమీక్ష నిర్వహించారు. ఈ బోనాలకు పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జూలై 16 నుంచి ఆగస్టు13వ తేదీ వరకు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గోల్కొండ, బల్కంపేట, ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ ఆలయాలపై

మిగతా2లో...

# అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విమానాశ్రయాల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి ఢిల్లీలోని పౌరవిమానయాన శాఖ కార్యాలయం లోమంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగావరంగల్ విమానాశ్రయ పనులపై కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. రైలు, రోడ్డు మార్గాలతో అనుసంధానమైఉండడంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఇతరపరిశ్రమలతో వరంగల్కీలకనగరంగా ఉందని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో పారిశ్రామికంగా మరింతగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం తెలియజేశారు. ఉత్తరతెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండజిల్లాలకు కేంద్రంగా వరంగల్ ఉంటుందని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్), ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేసినందున టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. 2028, జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగావరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లపై కేంద్ర మంత్రి, సీఎం చర్చించారు. వరంగల్‌కు ఘనమైన చరిత్ర ఉన్నందున, కాకతీయ చరిత్ర, సంస్కృతికి అద్దంపట్టేలా డిజైన్లు ఉండాలనిభావిస్తున్నట్లు సీఎం తెలిపారు. అందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సుముఖత వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణశాఖ ఆధ్వర్యంలో ఎయిర్ పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయంనిర్మించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం విజ్ఞప్తి చేశారు. రెండు ఎయిర్‌పోర్ట్‌లకు అవసరమైన భూమిని సేకరించి అందజేస్తామని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో మాదిరే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ లోనూ ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు నెలకొల్పాలన్నారు. వరంగల్, ఆదిలాబాద్ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణసంస్థలు (ఈ-ఫుక్ష)నెలకొల్పాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి సీ ప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సూచించారు. అందుకు అవసరమైనప్రతిపాదనలుసమర్పించాలని కేంద్ర మంత్రి సీఎంకు సూచించారు. సమావేశంలోనల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వసలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీకె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీకోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్, పౌరవిమానయాన శాఖ సెక్రటరీ మురళీధర్మోహోల్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ విపిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలు ఎన్నికల సమయానికే పరిమితం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశం అనంతరం సీఎం విలేకరులతో మాట్లాడారు. దేశాల అభివృద్ధిలో విమానాశ్రయాలుకీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన తెలిపారు. తెలంగాణలోనూ విమానాశ్రయాల అభివృద్ధి ద్వారా యువతకు ఉద్యోగాల కల్పన, అభివృద్ధికి తాము పాటుపడుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ అంశాల్లో తమకుసహకరిస్తుందని, ఎక్కడైనా సమస్యలుంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు.

# నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా

**మహబూబ్‌నగర్,జులై 14 :** నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉప కేంద్రాలను నిర్మిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంగళవారం వడ్డేపల్లి మండలం శాంతినగర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చాపర్ లో వచ్చిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర అతిధులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పుష్పగుచ్చాలు, మొక్కలతో స్వాగతం పలికి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. జులేకల్ గ్రామానికి రోడ్డు మార్గంలో చేరుకొని అలంపూర్ నియోజకవర్గంలోని జులేకల్, పచ్చర్ల, పుల్లూరు, మేడికొండ ప్రాంతాల్లో నిర్మించిన 33/11 కెవి ఉపకేంద్రాలను ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, మత్స్య, పశుసంవర్ధక, క్రీడల శాఖల మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. అలాగే ఎర్రవల్లి మండల కేంద్రం వద్ద రూ.155 కోట్ల నిధులతో 220/132/33 కెవి ఉపకేంద్రం నిర్మాణానికి కూడా ఇక్కడే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ట్రాన్స్ఫార్మర్లను పంపిణీ చేశారు. అనంతరం సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రసంగించారు. జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా మంగళవారం రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవాలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ట్రాన్స్కో సీఎండి కృష్ణ భాస్కర్, టీజీ ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్, సంస్థ డైరెక్టర్లు శివాజీ, నరసింహులు, రూరల్ జోన్ సీఈ బాలస్వామి, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఇన్చార్జి ఎస్ఈ నాగరాజు, డిఈ రవి ప్రసాద్, ఇతర ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు, జిల్లా నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో పరిస్థితులకనుగుణంగా పంటల ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

పనిచేసి రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వాలని చెప్పారు. వర్షపాతం తక్కువగా ఉన్నందున జొన్న, సజ్జ, కొర్ర, పెసర, మినుము, కంది వంటి తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని మంత్రి సూచించారు. అలాగే శాస్త్రవేత్తలు సూచించిన విధంగా తక్కువ కాలంలో పండే, తక్కువ నీరు అవసరమయ్యే అధిక దిగుబడి పంట రకాలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఐఐఎంఆర్ డైరెక్టర్ మాట్లాడుతూ కొర్ర, సజ్జ, జొన్న వంటి చిరుధాన్యాల సాగును పెంచాలని రైతులకు సూచించారు. భారత వాతావరణ శాఖ, హైదరాబాద్ సంచాలకురాలుస్టెల్లా మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఇప్పటివరకు సాధారణం కంటే 30 నుంచి 35 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. వచ్చే మూడు నెలల్లో కూడా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున తక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు మాట్లాడుతూ ఎగువ రాష్టాల్లో( కూడా వర్షపాతం తక్కువగా ఉండటంతో కృష్ణా, గోదావరి నదుల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందన్నారు. అందువల్ల నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలు సాగు చేయాలని సూచించారు. భూగర్భ జలాల శాఖ డైరెక్టర్ జిల్లాల వారీగా భూగర్భ జలాల పరిస్థితిని వివరించారు. రాబోయే రోజుల్లో నీటి మట్టం మరింత తగ్గే అవకాశం ఉన్నందున వరి, చెరకు వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. రైతు నేస్తం కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి . సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి, సహకార శాఖ ప్రత్యేక సంచాలకులు రాహుల్ రాజ్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య, నీటిపారుదల శాఖ ఇంజినీర్-ఇన్-చీఫ్ మధుసూదన్ రావు, భూగర్భ జలాల శాఖ సంచాలకులు లక్ష్మణ్, భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సత్యవతి, ఐఎండీ శాస్త్రవేత్త డాక్టర్ శ్రావణి, భారత నూనెగింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సురేష్, మెట్ట పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ కె.వి. రావు, అలాగే ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ మహాదేవప్ప పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయా రంగాలకు సంబంధించిన నిపుణులు రైతులకు ఎల్‌నినో పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే పంటల నిర్వహణ, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ పంటల సాగు, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై పలు సూచనలు చేశారు.

# ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధి

### ఆస్పత్రుల్లో అభివృద్ధికి కొత్త పాలసీతో ముందుకు వెళుతున్నాం

### ప్రజలకు సమీపంలో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు

### భద్రాద్రని కొత్తగూడెం జిల్లా ప్రతినిధులతో మంత్రి దామోదర సమీక్ష



**హైదరాబాద్,జులై 14** భద్రాద్రి కొత్తగూడెం సహా, రాష్ట్రంలోని అన్ని ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధికి కొత్త పాలసీని తీసుకొస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఐటీడీఏల పరిధిలో ఉన్న అన్ని ఏరియా హాస్పిటల్స్‌లో, దశలవారీగా సీటీ స్కాన్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు. ఈ ప్రాంతాల్లో జనాభా ప్రాతిపదికన కాకుండా, ప్రజలకు సమీపంలో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా దూరాన్ని బట్టి హాస్పిటళ్లను అభివృద్ధి చేస్తామని, అవసరమైన చోట కొత్త సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలను మంజూరు చేస్తామన్నారు. అవసరాన్ని బట్టి ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటళ్లలను అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు కొత్తగూడెం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సెక్రటేరియట్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనుకయ్య, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవిందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. కొత్తగూడెం మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంత్రిని కోరారు. ఎంసీహెచ్, జీజీహెచ్ నడుమ డిస్టన్స్ ఎక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో ఎంసీహెచ్‌కు ప్రత్యేకంగా ఒక ఇంచార్జ్ సూపరింటెండెంట్‌ను నియమించాలన్నారు. కొంత మంది డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కూనంనేని కోరారు. జిల్లాలో ప్రతి మండలానికి ఒక అంబులెన్స్, కొత్తగా 4 డయాలసిస్ సెంటర్లు మంజూరు చేసినందుకుగానూ ఎమ్మెల్యేలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కమ్యునిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటల్స్‌కు అనుబంధంగా అంబులెన్స్‌లను మంజూరు చేయాలని ఎమ్మెల్యేలు కోరారు. కొత్తగూడెం జిల్లాల్లోని ఏరియా హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని పీహెచ్‌సీలలో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వాటిని అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. టీచింగ్ హాస్పిటల్, జిల్లా హాస్పిటల్, ఏరియా హాస్పిటళ్లు, సీహెచ్‌సీలలో జనరేటర్లు ఇటీవలే ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, తమది అటవీ ప్రాంతం అయినందున వర్షాల సమయంలో పవర్ కట్ సమస్య ఉంటుందని, ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని పీహెచ్‌సీలలోనూ జనరేటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రి దామోదర మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అత్యంత మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. అడవులు, కొండలు, దూర ప్రాంతాలు, రవాణా సమస్యలు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో అడ్డంకులు కాకూడదు అన్నారు.

# మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇకలేరు..!

(మొదటి పేజీ తరువాయి)

ముంచుతూ ఈ లోకాన్ని విడిచి వెళ్లారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో జన్మించిన ముద్రగడ.. తండ్రి వీర రాఘవరావు స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చారు. వీర రాఘవరావు ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందగా.. 1978లో జనతా పార్టీ ఎమ్మెల్యేగా ముద్రగడ తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన మంత్రిగా సేవలందించారు.కన్నుమూశారు. కొన్ని నెలలుగా ఆనారోగ్యంతో బాధ పడుతున్న ముద్రగడ మంగళవారం సాయంత్రం ప్రాణాలు విడిచారు. హైదరాబాద్ సింధు ఆస్పత్రిలో శ్వాసకోస సమస్యకు చికిత్స పొందుతూ.. పరిస్థితి విషమించడంతో ముద్రగడ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో ఏపీలో విషాదం నెలకొంది.

# ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులు ప్రారంభించాలి..

(మొదటి పేజీ తరువాయి)

శాఖ అనుమతులు ఇప్పించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్థరీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, శ్రీశైలం జలాశయాలు ఈ కారిడార్ పరిధిలో ఉంటాయని సీఎం తెలిపారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు ఆరు వరుసల ప్రత్యామ్నాయ రహదారికి అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యామ్నాయ రహదారికి అవసరమైన భూ సేకరణ తాము చేపడతామని సీఎం తెలిపారు. ఈ ప్రత్యామ్నాయ రహదారి వ్యవసాయ, వ్యాపారపరంగా నూతన అవకాశాలను సృష్టిస్తుందని సీఎం తెలిపారు. సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ దితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో ఇందిరమ్మ ఇండ్ల హవా

**హైదరాబాద్,జులై 14 :** ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయిన రోజు నుంచి గృహ ప్రవేశం వరకు తమ ఆనందాన్ని, అనుభవాలను అనేక మంది లబ్దిదారులు యూట్యూబ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. తొలిదశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు, రెండో దశలో 2.5 లక్షల ఇండ్లు.. మూడో దశ, నాలుగో దశ, ఐదో దశ.. ఇలా ప్రతి పేదవాడి సొంతింటి కలను ఇందిరమ్మ ఇండ్ల రూపంలో సాకారం చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేదల చిరునవ్వులే మా ప్రభుత్వానికి గొప్ప పురస్కారాలని పేర్కొన్నారు. గతంలో లాగా మభ్య పెట్టే కార్యక్రమంగా కాకుండా పేదలకు ఇళ్లను నిర్మించి ఇస్తున్నామని, అందుకు వీడియోలే సాక్ష్యమనితెలిపారు.

# ఊరూరా బిఆర్ఎస్ కుట్రలపై ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

రావాలంటే ఏం చేయాలో నిపుణులు చెబితే వెంటనే అమలు చేస్తామని మంత్రి వెల్లడించారు. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. కరవును దృష్టిలో పెట్టుకొని ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే మేడిగడ్డ, కన్నెపల్లి విషయంలో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వర్షాలు తక్కువ పడతాయని శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు చెబుతున్నారన్నారు. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరఫున సూచనలు చేస్తున్నామని చెప్పారు. కరవును దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్నామ్యాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలుగా అంతర్గతంగా ఎన్ని సమస్యలు ఉన్నా కలిసి ఎదుర్కోవాలని.. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా సలహాలు, సూచనలు ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ఆషాఢ బోనాలకు భారీగా ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. టాస్క్‌ఫోర్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సిటీ ఆర్మ్‌డ్, రిజర్వ్, క్విక్ రియాక్షన్ టీమ్స్ భారీగా మోహరిస్తున్నట్లు వివరించారు. భక్తులకు సమాచారం కోసం ఆలయాల వద్ద పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ వివరించారు. మహిళా భక్తుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని.. అందుకోసం షీ టీమ్స్‌తో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈవ్ టీజింగ్, గొలుసు దొంగతనాలు, మొబైల్ స్నాచింగ్, జేబుదొంగలపై ఉక్కుపాదం మోపనున్నట్లు చెప్పారు.

గత బోనాల్లో 644 మంది ఆకతాయిలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని ఆయన గుర్తు చేశారు. బోనాల ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలు, ఘటాల ఊరేగింపులకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని వివరించారు. ఆలయాల పరిసరాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని నగర సీపీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయండి

(మొదటి పేజీ తరువాయి)

అందజేసి మీ యొక్క ఆమూల్యమైన ఓటుహక్కును కాపాడుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఐఎఎస్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. బిఎల్ఒలు అందజేసిన ఫారాల్లో ఎలాంటి తప్పులు లేకుండా పూరించి, ఫోటోలను అతికించి బిఎల్ఒలకు అందించాలని సిఇఒ కోరారు. ఎన్యూమరేషన్ ఫారంలో తప్పనిసరిగా ఓటర్ సంతకం, తేదీతో పాటు బిఎల్ఒల సంతకం ఉండేలా చూసుకోవాలని సూచించారు. బిఎల్ఒలు ఓటర్లకు అందజేసిన రెండు ఎన్యూమరేషన్ ఫారాల్లో ఒకటి బిఎల్ఒలకు ఇవ్వాలని, మరొకటి ఓటర్ భద్రపరుచుకోవాలని పేర్కొన్నారు. పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్ఒలకు ఇస్తేనే డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో ఓటరు పేరు నమోదు అవుతుందని స్పష్టం చేశారు. 2002 ఓటరు జాబితాలో ఓటర్ వివరాలు ఉన్నట్లయితే తప్పనిసరిగా నింపాలని, ఒకవేళ అటువంటి వివరాలను లేకపోయిన ప్రస్తుత వివరాలతో ఎన్యూమరేషన్ ఫారాలను నింపి బిఎల్ఒలకు అందజేయాలన్నారు. రాష్ట్రంలోని మొత్తం3,38,26,448 మంది ఓటర్లలో ఇప్పటివరకు 1,66,70,610 మంది ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారమ్‌లను సమర్పించారు. సర్ పక్రియ జూన్ 25 నాడు ప్రారంభమైందని, మరో పది రోజుల్లో ఈ పక్రియ ముగుస్తుందని, ఓటర్లు పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే బిఎల్ఒలకు అందజేయాలని సూచించారు.

# ఎం.ఇ.ఎఫ్. ఖమ్మం జిల్లా నాయకులు చెరుకుపల్లి వెంకయ్య మాదిగ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి.

- ఎంఎస్పీ జాతీయ నాయకులు
- వంగూరి ఆనందరావు మాదిగ

**ఖమ్మం/జులై14/(పీపుల్స్ న్యూస్)**
ఇటీవల కాలంలో అనారోగ్యానికి గురై అకాల మరణానికి గురి అయిన ఖమ్మం జిల్లా ముదిగొండ మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఖమ్మం జిల్లా నాయకులు చెరుకుపల్లి వెంకయ్య మాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జాతీయ రాష్ట్ర జిల్లా మండల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆనందరావు మాదిగ మాట్లాడుతూ... చెరుకుపల్లి వెంకయ్య మాదిగ మాదిగ ఉద్యోగుల సమాఖ్య తరఫునె కాక ఖమ్మం జిల్లాలో ఎమ్మార్పీఎస్ తరపున వారి సేవలు అనిర్వచనీయమం అని వారు లేని లోటు మాదిగ ఉద్యోగుల సమాఖ్య కే కాక మాదిగ జాతికే తీరనిలోటని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసినారు ఉద్యమ కార్యాచరణలో భాగంగా అనేక ఉద్యమ ఘట్టాలలో వెంకయ్య మాదిగ సేవలు మరిచిపోలేనివని ఉద్యమ అవసరాల రీత్యా ఉద్యమకారులకు గాని ఉద్యోగులకు సమైక్య తరఫున గాని వెంకయ్య మాదిగ అందించిన సేవలు తనదైన శైలిలో అందించారు అని ఈ సందర్భంగా గుర్తు చేసినారు ఉద్యమ అధినేత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో గ్రామస్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు వెంకయ్య మాదిగ సేవలు మర్చిపోలేనివని తెలియజేసినారు వెంకయ్య మాదిగ కు సతీమణి సావిత్రమ్మ కుమారుడు చెరుకుపల్లి శివ కుమార్తె హిందూ వున్నారు వెంకయ్య మాదిగ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన వారిలో ఎంఎస్పి రాష్ట్ర ప్రధాన కార్య దర్శి పగిడికత్తుల ఈదయ్య మాదిగ, ఎంఎస్పి జిల్లా సీనియర్ నాయకులు కొలిక పొంగు వెంకట్రావు మాదిగ, గూడూరి వీరస్వామి మాదిగ, ముదిగొండ మండల ఇన్చార్జి లంజపల్లి వీరభద్రం మాదిగ, ఎమ్మార్పీఎస్ ముదిగొండ మండల అధ్యక్షులు పడిశాల నాగేశ్వరావు మాదిగ, మాజీ మండల అధ్యక్షులు కట్టగూరు సురేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ ముదిగొండ మండల అధికార ప్రతినిధి ఎం రాతి నాగరాజు మాదిగ, మాదాపురం గ్రామ ఎంఆర్పిఎస్ అధ్యక్షులు పడిశాల గురవయ్య మాదిగ, ముదిగొండ ఎమ్మార్పీయస్ గ్రామ అధికార ప్రతినిధి కట్టగూరి బాబు మాదిగ, లు ఉన్నారు.





# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారా? వెంటనే ఫిర్యాదు చేయండి..!

- ఫొటో లేదా వీడియో తీసి 8712663570కు పంపండి
- బాలానగర్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు పిలుపు



**బాలానగర్ జులై 15 ( పీపుల్స్ న్యూస్)**
సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని బాలానగర్ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇతర వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలిగించే వారిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాలానగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు కోరారు. నిబంధనలు అతిక్రమించే వాహనదారుల ఫొటోలు లేదా వీడియోలను 8712663570 నంబర్‌కు పంపించి ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఈసందర్భంగా సీఐ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిగ్నల్స్ ఉల్లంఘించడం, రాంగ్ రూట్ దారిలో వాహనం నడపడం, ప్రమాదకరంగా డ్రైవింగ్ చేయడం, రోడ్డుపై ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వాహనాలు నడపడం వంటి చర్యలను ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న సీఐ శ్రీనివాసరావు, ట్రాఫిక్ నిబంధనలను ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో ప్రమాదాలను తగ్గించి, సురక్షితమైన రవాణా వ్యవస్థను నెలకొల్పడం సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను గౌరవించి, బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించడం ద్వారా రోడ్డు భద్రతకు తమ వంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు.

# కండిషన్ లేని వాహనాలు..విద్యార్థుల ప్రాణాలతో చెలగాటాలు

- మొగుళ్ళపల్లిలో ప్రైవేట్ పాఠశాలల వాహనాల తనిఖీలను చేపట్టిన ఏఆర్టీవో సుందర్ నాయక్
- రెండు టాటా మ్యాజిక్ వాహనాలు సీజ్



**మొగుళ్ళ పల్లి ప్రతినిధి జూలై 14 (పీపుల్స్ న్యూస్)**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలో ప్రైవేట్ పాఠశాలల వాహనాల తీరు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతుంది. దీంతో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆదేశాల మేరకు మంగళవారం మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని బ్రిడ్జి వద్ద రవాణా శాఖ అధికారులు తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా పర్లపెల్లి గ్రామంలో గల ఎస్వీ పాఠశాలకు చెందిన టాటా మ్యాజిక్ తో పాటు మండల కేంద్రంలోని కేశవ హై స్కూల్ పాఠశాలకు చెందిన టాటా మ్యాజిక్ లను సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్ కు అప్పగించారు. ఈ సందర్భంగా ఏఆర్టీవో సబ్ ఇన్స్పెక్టర్ సుందర్ నాయక్ మాట్లాడారు. కాలం చెల్లిన వాహనాలతో విద్యార్థులను పాఠశాలలకు తరలించడం మూలంగా ఆ వాహనాలు ప్రమాదాలకు గురై అనేకమంది విద్యార్థులు ప్రాణాలను కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. అదేవిధంగా ఫిట్నెస్, వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవర్ లైసెన్సులు, ఇన్సూరెన్స్, పొల్యూషన్ లాంటి పత్రాలు లేని వాహనాలను కూడా సీజ్ ఆయన చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు తుక్కు పట్టిన టాటా మ్యాజిక్ లలో, ఆటోలలో విద్యార్థులను పరిమితికి మించి తీసుకెళ్లి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటలాడొద్దన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు విద్యార్థులను తరలించే ఫిట్నెస్ లేని వాహనాలపై, ఆటోలపై, టాటా మ్యాజిక్ లపై నిరంతరం నిఘా ఉంచి వాటిని ఎప్పటికప్పుడు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

# ప్రజాస్వామ్య రక్షణకై ఓటు హక్కును కాపాడుకోవాలి

- సర్ సవరణలో ప్రజలంతా భాగస్వాములుకండి
- ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- 18 ఏళ్లు నిండిన యువత వంద శాతం ఓటు హక్కును పొందాలి
- బూత్ స్థాయిలో సామాజిక కార్యకర్తలు,యువత పాల్గొని బీఎల్ఓలతో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును కల్పించాలి
- మొగుళ్ళపల్లి తహసిల్దార్ జాలీ సునీతా రెడ్డి



**మొగుళ్ళ పల్లి ప్రతినిధి జూలై 14 (పీపుల్స్ న్యూస్)**
భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ' పై చైతన్యం తీసుకురావడానికి, నకిలీ ఓట్లను అరికట్టడానికి ఇంటింటి ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియ విజయవంతంగా కొనసాగుతుందని, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలో నేటి వరకు 65 శాతం ఎన్యూమరేషన్ దరఖా స్తులను ఆన్లైన్ చేయడం జరిగిం దని తహసిల్దార్ జాలీ సునీతా రెడ్డి తెలిపారు. మంగళవారం తన చాంబర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు వెన్నుముక లాంటి ఓటరు జాబితాను పారదర్శకం గా తయారు చేయడమే ఈ ప్రత్యేక సర్వే ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. గతంలో జరిగిన అక్రమాలను అరికట్టడానికి, అర్హులైన ఏ ఒక్కరూ నష్టపోకుండా ఉండడానికి బూత్ లెవల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని బీఎల్ఓలను కోరారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండే ప్రతి ఒక్క యువతీ, యువకుడు తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలనీ, రాబోయే భవిష్యత్తును నిర్ణయించే శక్తి యువత చేతుల్లోనే ఉందనీ స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేర్లు తొలగించి, అలాగే ఒకే వ్యక్తికి రెండు, మూడు చోట్ల ఉన్న నకిలీ ఓట్లను గుర్తించి, ఒక్క చోట మాత్రమే ఓటు ఉండే విధంగా అధికారులు చూడాలన్నారు. బూత్ స్థాయి అధికారులు బీఎల్ఓ ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు పూర్తి సమాచారం అందించి వారికి సహకరించాలనీ కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని బూత్ స్థాయి అధికారులకు తెలిపారు. అదే విధంగా వార్డుల్లో ఉన్న నిరక్షరాస్యులకు, వృద్ధులకు ఓటు హక్కు పరిశీలనలో సామాజిక కార్యకర్తలు, ప్రతి ఒక్కరూ సైనికులుగా ఉండి ప్రజలకు తోడ్పాటు అందించాలని తెలిపారు. అంతేకాకుండా, యువకులు, ప్రజలు తమ స్మార్ట్ఫోన్ ద్వారా కూడా ఓటు హెల్ప్ లైన్ అప్ లేదా కేంద్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్సైట్ జశీవతీం.వఎఱ.ౖశీజ.అఅ లో స్వయంగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్లైన్ దరఖాస్తుల సమయం 10 రోజుల గడువు మాత్రమే ఉంది. కాబట్టి చివరి రోజులలో సర్వర్ ప్రాబ్లం అయ్యే అవకాశం ఉన్నందున ఈనెల 20 లోపు అందరూ ఎన్యూమరేషన్ దరఖాస్తులను నింపి మీ యొక్క బీఎల్ఓలకు అందజేయాలన్నారు. గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, బీఎల్ఏ, అన్ని పార్టీల ప్రజా ప్రతినిధులు, గ్రామస్థాయి అధికారులు, యువకులు ముఖ్యంగా వార్డు మెంబర్లు మీ పరిధిలో ఎన్యూమరేషన్ ఫారం నింపి ఇవ్వని వారిని గుర్తించి, వారిచే ఫారం నింపించి సంబంధిత బీఎల్వోలకు అందజేయాలని, గ్రామస్థాయిలో అందరూ సహకరించి సర్ ను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

# భద్రాచలంలో సంక్షేమ వసతి గృహాల్లో చేరేందుకు ప్రచార కరపత్రాల ఆవిష్కరణ.

- తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ వర్కింగ్ ప్రెసిడెంట్ : దామళ్ళ సత్యం



**ఖమ్మం /భద్రాచలం, /జూలై 14/(పీపుల్స్ న్యూస్ )**
తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ (TSSA) ఆధ్వర్యంలో భద్రాచలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో చేరేందుకు అవగాహన కల్పిస్తూ ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, వరంగల్ జోన్ ఇన్‌చార్జ్ దామల సత్యం మాట్లాడుతూ, ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు, అలాగే ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు, విద్యార్థినులు తమ జిల్లాలు, మండల కేంద్రాల్లో ఉన్న ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో వెంటనే చేరి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.
డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ వసతి గృహాలు పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి, భోజనం, చదువుకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నాయని తెలిపారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ హాస్టళ్లలో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు.
ప్రస్తుతం హాస్టల్ అడ్మిషన్ల ప్రక్రియ ఈ నెలతో ముగియనున్నందున, ఇంకా చేరని అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు వెంటనే దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో చేరాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బయ్యన వీరబాబు, జిల్లా కార్యదర్శి వరదా సాయికుమార్, పలువురు విద్యార్థులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా వినాయక ఆగ్రో ఏజెన్సీస్

- రైతుల ఫిర్యాదు మేరకు వ్యవసాయ శాఖ అధికారుల తనిఖీలు
- తనిఖీల్లో నిబంధనలు పాటించని వినాయక ఆగ్రో ఏజెన్సీస్
- వినాయక ఆగ్రో ఏజెన్సీస్ ను సీజ్ చేసిన వ్యవసాయ అధికారులు



**మొగుళ్ళ పల్లి ప్రతినిధి జూలై 14 (పీపుల్స్ న్యూస్)**
విత్తన, ఎరువుల పురుగుమందుల డీలర్లు సూచించబడిన చట్టాలకు లోబడి విక్రయాలు జరుపుకోవాల్సి ఉండగా..జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని వినాయక ఆగ్రో ఏజెన్సీస్ డీలర్ ఇరుపాల రాజేశ్వర్ రావు నిబంధనలకు విరుద్ధంగా ఫర్టిలైజర్ షాప్ ను నడుపుతుండడంతో..రైతుల ఫి ర్యాదు మేరకు భూపాలపల్లి ఏడిఏ ఎన్ రమేష్ నేతృత్వంలో వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా ఎరువుల ల భ్యత, నిల్వలు, లైసెన్స్ వివరాలు, కొనుగోలు రసీదులు, అమ్మకపు బిల్లులు, స్టాక్ రిజిస్టర్లు, స్టాక్ ధరల పట్టిక మొదలగునవి పరిశీలించారు. స్థానిక విచారణ ద్వారా సంబంధిత ఎరువుల డీలర్ ఇరుపాల రాజేశ్వర్ రావు ఎరువుల చట్టాలకు విరుద్ధంగా విక్రయాలను నిర్వహిస్తున్నట్టు నిర్ధారణ కావడం జరిగిందని ఏడిఏ ఎన్ రమేష్ తెలిపారు. వినాయక ఆగ్రో ఏజెన్సీస్ తనిఖీల్లో డీఏపి ఇతర ఎరువులను ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరలకు అమ్మకాలు జరపడం, స్టాక్ వి వరాలను ప్రదర్శించకపోవడం, స్టాక్ వివరాలు టాలీ కాక పోవడం, అమ్మిన ఎరువులకు సంబంధించిన బిల్లులను రైతులకు ఇవ్వకపోవడం, ఈ–పాస్ మెషిన్ లోని వివరాలకు, నిల్వ ఉన్న స్టాక్ వివరాలకు మధ్య వ్యత్యాసం ఉండడం పైన పేర్కొన్న చట్ట విరుద్ధ చర్యలకు గాను లైసెన్స్ అథారిటీ సంబంధిత ఎరవుల లై సెన్స్ నుసస్పెండ్‌చేయడం జరి గిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయ అది. కారి పి సురేందర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ శ్రీకాంత్ పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 14 (పీపుల్స్ న్యూస్):**





అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మెహదీపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మాసాబ్ ట్యాంక్ నుండి ఎన్.ఎమ్.డి.సి రోడ్డు మధ్య మంగళవారం తెల్లవారుజామున సుమారు 4:00 గంటల నుండి 5:00 గంటల మధ్య కాలంలో ఒక గుర్తుతెలియని పురుషుడు కేబుల్ వైర్‌తో ఉరివేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు గుర్తించారు. సుమారు 35 నుండి 40 సంవత్సరాలు ఉండవచ్చు.హిందూ వ్యక్తిగా కనిపిస్తున్నారు. పసుపు , నలుపు రంగు గీతలు ఉన్న టీ–షర్ట్ , నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నారు. మృతుని చేతిలో ఒక హెల్మెట్ ఉన్నది.మృతుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం, గుర్తింపు కొరకు ఉస్మానియా జనరల్ హాస్పిటల్ మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై మెహదీపట్నం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాము.మృతుడికి సంబంధించిన ఎలాంటి సమాచారమైనా తెలిసిన వారు లేదా మృతుడిని గుర్తించిన వారు వెంటనే మెహదీపట్నం పోలీస్ స్టేషన్ వారిని 8712661274 నెంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.

# మెట్రో అనుమతుల్లో జాప్యం - పెంచుతోంది అంచనా వ్యయం



**హైదరాబాద్ :**హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు మొదటి దశ స్వాధీనానికి కావాల్సిన రూ.13,600 కోట్ల రుణం, రెండో దశ విస్తరణకు సంబంధించిన అంశాలపై కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. దీంతో అంచనా వ్యయం భారీగా పెరిగిపోతుంది. ఆలస్యం అవుతున్న కొద్దీ ఆ భారం రాష్ట్ర ప్రభుత్వంపై పడుతుందని ఇంజినీరింగ్ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వీలైనంత త్వరగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం చేసుకొని మెట్రో ప్రాజెక్టు పనులను ప్రారంభించాలని హైదరాబాద్ వాసులు కోరుతున్నారు.జాయింట్ వెంచర్‌గా ప్రాజెక్టు : హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు భారం భారీగా పెరిగిపోతోంది. కేంద్రం సూచనల మేరకు డీపీఆర్‌లో చేసిన సవరణలు త్వరగా పూర్తి కాకుంటే ఈ అంచనా మరింత పెరిగే అవకాశం ఉందని మెట్రో వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రెండో దశలో పార్ట్–ఏ, పార్ట్–బీ కింద మొత్తం 8 కారిడార్లతో 162.5 కిలోమీటర్ల మేర ప్రాజెక్టును ప్రతిపాదించారు. ప్రాజెక్టును 50 : 50 నిష్పత్తిలో జాయింట్ వెంచర్‌గా చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి.సవరణ వ్యయంతో కేంద్రానికి డీపీఆర్ : పార్ట్–ఏకు సంబంధించిన డీపీఆర్‌ను 2024 నవంబర్ 4న, పార్ట్–బీ డీపీఆర్‌ను 2025 జులైలో కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం పంపింది. అనంతరం రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి భారత్ ఫ్యూచర్‌సిటీ వరకు 39.6 కిలోమీటర్ల కారిడార్‌ను మూడో దశగా విడదీశారు. దీంతో 7 కారిడార్లతో 122.9 కిలోమీటర్ల మేర నిర్మాణానికి రూ.35,000 కోట్ల అంచనా వ్యయంతో సవరించిన డీపీఆర్‌ను కేంద్రానికి పంపారు.అనుమతులు సహా ఇతర అంశాల్లో జాప్యం : మొదటిసారిగా నవంబర్ 2024లో కేంద్ర ప్రభుత్వానికి అందజేసిన అంచనా వ్యయం రూ.34,260 కోట్లుగా ఉంది. ఈ మధ్య కాలంలో అందజేసిన ప్రతిపాదనల అంచనా వ్యయం రూ.38,590 కోట్లుగా ఉంది. అంటే అంచనా వ్యయం రూ.4,330 కోట్లకు పెరిగింది. అనుమతులు సహా ఇతర అంశాల్లో జాప్యం కారణంగా అంచనా వ్యయం పెరుగుతోంది. అయితే ఆ భారం రాష్ట్ర ప్రభుత్వంపై పడుతుందని ఇంజినీరింగ్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ప్రాజెక్ట్ అసెస్?మెంట్ ఆరు నెలల్లో పూర్తి : మొదటి దశ స్వాధీనానికి రెండో దశ విస్తరణకు సంబంధించిన అంచనాలను తయారు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కన్సల్టెన్సీగా ఎస్బీఐ క్యాప్స్?ను నియమించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఇంతవరకు విడుదల కాలేదు. గతంలో జరిగిన చర్చల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తమ ప్రతినిధిని ఇప్పటికే నియమించింది. త్వరగా కన్సల్టెన్సీనికి సంబంధించిన ఉత్తర్వులు జారీచేస్తే మెట్రో రైల్ ప్రాజెక్ట్ అసెస్?మెంట్ ఆరు నెలల్లో పూర్తయ్యే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.ప్రాజెక్టుకు సంబంధించిన ఆస్తుల అంచనా : హైదరాబాద్? మెట్రో మొదటి దశ స్వాధీన ప్రక్రియ, రెండో దశ విస్తరణ, నిర్మాణ వ్యయం, రుణ సేకరణ అంశాలపై కన్సల్టెన్సీ సంస్థ ఎస్బీఐ క్యాప్స్ అధ్యయనం చేసి నివేదిక అందించనుంది. కన్సల్టెన్సీ అధికారులు మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన ఆస్తుల అంచనా, విస్తరణ ప్రణాళికల పరిశీలన, డ్యాక్యుమెంట్లను పరిశీలన చేసేందుకు డిసెంబర్ వరకు సమయం తీసుకొనే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# ఐదేళ్లుగా సహజీవనం



**హుజురాబాద్:** భర్త మరణంతో ఒంటరైన మహిళ ఓ మనిషిని నమ్మింది. అతనే సర్వస్వం అనుకుని సహజీవనాన్ని మొదలుపెట్టింది. ఇద్దరూ కలిసి అయినవారికి దూరంగా వేరొక ఊరిలో కాపురం పెట్టారు. అక్కడ ఆమెకు వేరొక మహిళతో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త స్నేహంగా మారి తన కష్టసుఖాలు పంచుకునేంతా బలపడింది. అదే ఆ మహిళపాలిట శాపంగా మారింది. చివరకు స్నేహితురాలి ఇంట్లోని బావిలో శవంగా తేలింది. అసలేం జరిగింది? ఇది హత్యా లేక ఆత్మహత్యా? ఆమె చావుకు గల కారణాలేంటి? పోలీసులు ఈ కేసును ఎలా ఛేదించారు?కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లోని ఓ ఇంటివద్ద గల బావిలో ఈ నెల 11న అనుమానాస్పద స్థితిలో ఓ మృతదేహం లభించింది. మామిండ్లవాడకు చెందిన ముత్తోజు భాగ్య అనే మహిళ తన ఇంటి ఆవరణలోని బావిలో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. బావిలోంచి మృతదేహాన్ని బైటకు తీశారు. మృతురాలు స్థానికంగా నివాసముండే చింత సునీతగా గుర్తించారు. మృతురాలి మెడకు చీరతో ఉరివేసినట్లు కట్టి ఉంది. ముఖం, పెదాలపై కొట్టిన గాయాలున్నట్లు పోలీసులు గుర్తించారు. అసలేం జరిగింది? ఆమెను ఎవరు హత్య చేసిందేవరు?

# ప్రజల గుండెల్లో స్థానం సంపాదిస్తూ... సేవతో ముందుకు సాగుతున్న భూక్య జంపన్న

- ●30వ విడత మెగా ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం
- ●44 మందికి శస్త్రచికిత్సల కోసం ఎంపిక














**(వెంకటాపురం) ములుగు జిల్లా ప్రతినిధి జూలై 14 (పీపుల్స్ న్యూస్)**
ప్రజాసేవనే పరమావధిగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య జంపన్న ఆధ్వర్యంలో వెంకటాపురం మండల కేంద్రంలో నిర్వహించిన 30వ విడత మెగా ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. శిబిరంలో కంటి సమస్యలతో బాధపడుతున్న పేదలు, వృద్ధులకు నిపుణులైన వైద్యులచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహించగా, శస్త్రచికిత్స అవసరమైన 44 మందిని గుర్తించి, హైదరాబాద్‌లోని శంకర కంటి ఆసుపత్రికి ప్రత్యేక బస్సు ద్వారా తరలించారు.గత రెండున్నర సంవత్సరాలుగా ములుగు జిల్లాలోని గ్రామాల వారీగా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ వేలాది మంది నిరుపేదలకు చూపును అందించే సేవా కార్యక్రమాలను భూక్య జంపన్న నిరంతరంగా కొనసాగిస్తున్నారు. ఆయన చేపడుతున్న ఈ సేవా కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది.ఈ సందర్భంగా భూక్య జంపన్న మాట్లాడుతూ, "పేద ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాను. నేను చేస్తున్న సేవను చూసి కొందరు తప్పుడు ప్రచారం చేసినా వాటిని ఏమాత్రం పట్టించుకోను. ప్రజలే నాకు బలం, వారి ఆశీస్సులే నా ఆస్తి. ప్రజల ఆశీర్వాదం ఉన్నంత వరకు సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తాను" అని అన్నారు.అలాగే త్వరలో ములుగు జిల్లాలోని ప్రతి గ్రామానికి, ప్రతి గడపకు వెళ్లి ప్రజల ఆశీర్వాదం కోరనున్నట్లు తెలిపారు. "మీ ఇంటికి మీ ఆశీర్వాదం కోసం వస్తాను. మీ ప్రేమ, మీ ఆశీస్సులు ఎల్లప్పుడూ నాకు ఉండాలి" అని ఆయన పేర్కొన్నారు.శిబిరం ద్వారా లబ్ధి పొందిన వృద్ధులు, పేద కుటుంబాలు మాట్లాడుతూ, కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న తమకు భూక్య జంపన్న ఇంటి పెద్ద కొడుకులా అండగా నిలిచారని తెలిపారు. తమ జీవితాల్లో మళ్లీ వెలుగులు నింపిన ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో ప్రజాసేవను మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆశీర్వదించారు.ప్రజాసేవనే రాజకీయానికి పునాదిగా చేసుకుని ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించుకున్న భూక్య జంపన్న సేవలు ములుగు జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నాయని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వెంకటాపూర్ మాజీ మండల అధ్యక్షులు లింగాల రమణా రెడ్డి, మాజీ సర్పంచ్ సాదా యాదగిరి , చంటి భద్రయ్య బాదావత్ రాజ్ కుమార్ పోషల్ల వీరమల్లు నల్ల భద్రయ్య , నరెట్ల విజయేందర్ , నూనె రమేష్ , సోమిడి రవి చిక్కుల కళ్యాణి జహీర్ పాషా గారు, చిగురు దేవేందర్, తోట సంపత్ తదితరులు పాల్గొన్నారు..

# ఆరామ్‌ఘర్‌లోని 12 ఎకరాల స్థలాన్ని పరిశీలించిన

●హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్












**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 14 (పీపుల్స్ న్యూస్) :**
ఆరామ్‌ఘర్‌లోని 12 ఎకరాల స్థలాన్ని మంగళవారం హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ డి. జోయల్ డెవిస్, ఇతర పోలీసు అధికారులతో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు అక్కడ ఉన్న భవనాలు , సరిహద్దు పరిమితులతో సహా ఆ భూమిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వారు సంబంధిత సిబ్బందికి పలు సూచనలను జారీ చేశారు: ఆ భూమికి సంబంధించిన పూర్తి వివరాల రికార్డు , పర్యవేక్షణ కోసం డ్రోన్ కెమెరా ద్వారా వైమానిక దృశ్యాలను చిత్రీకరించాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ అధికారితో సమన్వయం చేసుకుంటూ సరిహద్దులను గుర్తించే ప్రక్రియను ప్రారంభించాలన్నారు. ప్రాంగణంలో ఉన్న అన్ని నిర్మాణాలపై జీపీఎస్ ఆధారిత సర్వే నిర్వహించి వివరణాత్మక మ్యాప్‌ను సిద్ధం చేయాలని సూచించారు.

**రెండవ సఫర్ ప్రణాళిక , రూట్ మ్యాప్ పరిశీలన:**
త్వరలో జరగనున్న రెండవ సఫర్ ఏర్పాట్లను సమీక్షించేందుకు హైదరాబాద్ ట్రాఫిక్–××× డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాహుల్ హెగ్డే బి.కె మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్శనలో ఆయన రెండవ సఫర్ ప్రణాళిక వివరాలను అడిగి తెలుసుకుని, ఊరేగింపు సాగే మార్గం యొక్క మ్యాప్‌ను నిశితంగా పరిశీలించారు. అనంతరం, ఊరేగింపు ప్రారంభమయ్యే స్థలాన్ని సందర్శించడంతో పాటు ఊరేగింపు సాగే పూర్తి మార్గాన్ని వ్యక్తిగతంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమం ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు వీలుగా బందోబస్తు ఏర్పాట్లపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రెం డవ సఫర్ కార్యక్రమంలో శాంతిభద్రతల పరిరక్షణ, భద్రత , సమర్థవంతమైన సమన్వయాన్ని నిర్ధారించడానికి ఈ చర్యలు చేపట్టారు.

**గోల్కొండ బోనాలు -- మొదటి పూజ ఏర్పాట్ల సమీక్ష**
గోల్కొండ బోనాల ఊరేగింపు ప్రారంభం కానున్న లంగర్ హౌస్ ఎక్స్ రోడ్స్‌తో పాటు, అక్కడ కేటాయించిన వాహనాల పార్కింగ్ స్థలాలను హైదరాబాద్ ట్రాఫిక్–×× డీసీపీ కాజల్ సింగ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా, రాబోయే గోల్కొండ బోనాల మొదటి పూజ , ఆ తర్వాత జరిగే తదుపరి కార్యక్రమాలు సజావుగా సాగేలా చూడటానికి ఏర్పాట్లను సమీక్షించి, అధికారులకు నిర్దిష్ట ఆదేశాలు జారీ చేశారు. అలాగే, భక్తుల భద్రత , సౌకర్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఉత్సవాల పొడవునా సమర్థవంతమైన సమన్వయం , క్రమశిక్షణతో కూడిన పర్యవేక్షణ ఉండాలని విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది అందరినీ ఆమె ఆదేశించారు.

# రెవిన్యూ ఇన్స్పెక్టర్ బరితెగింపు..?

- ●ఆర్ఐ' తీరే.. అక్రమార్కుల దారి!?
- ●ఆల్విన్ కాలనీ సర్వే నెం. 336లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు?
- ●'జేసీబీ దొరకట్లేదు' అంటూ కుంటిసాకులు..?
- ●చేతులు మారిన భారీ ముడుపులు?
- ●తుంగలో తొక్కినఎమ్మార్వో చర్యలు..?
- ●హైడ్రా' ఉన్నా ఇక్కడ ఆర్ఐ ఇష్టారాజ్యమే.. స్థానికుల తీవ్ర ఆగ్రహం..







**కూకట్‌పల్లి, జూలై 14 (పీపుల్స్ న్యూస్)**
స్థానిక కూకట్ పల్లి మండల రెవిన్యూ పరిధిలో కొందరి అవినీతి అధికారులు కొత్త దారి వెతుక్కున్నాయి.. నిబంధనల సాకుతో సామాన్యులను వేధించే అధికారులు.. ఇప్పుడు ఏకంగా అక్రమ వసూళ్లకు తెరలేపారు. అత్యంత ఖరీదైన సర్వే నెంబర్ 336 భూమి ఆక్రమణ వ్యవహారం అవినీతి అధికారులకు కాసుల కుంభకోణంగా మారింది. ' లక్షలు ఇస్తావా? లేదంటే నిర్మాణం పీకేమయంటావా? అంటూ బహిరంగంగానే నిర్మాణదారులను బెదిరిస్తున్నరనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారింది.
ప్రభుత్వ స్థలాలను గుర్తించి, వాటిని కంటికి రెప్పలా కాపాడాల్సిన అధికారులే.. కాసుల కక్కుర్తితో కబ్జాదారులకు సింహద్వారాలు తెరుస్తున్నారు. కూకట్‌పల్లి మండల పరిధిలోని ఆల్విన్ కాలనీ సర్వే నెంబర్ 336లో స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) వ్యవహరిస్తున్న తీరుపై స్థానిక ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రభుత్వ భూమిని భక్షించే అక్రమార్కులకు ఆజ్యం పోస్తూ, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఆర్ఐ తీరుపై సర్వత్రా ఘాటైన విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**కూల్చిన చోటే మళ్లీ నిర్మాణం..**
**అధికారుల అండ లేకపోతే సాధ్యమా?**

గతంలో ఇదే సర్వే నెంబర్ 336లోని ప్రభుత్వ స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాలను అప్పటి ఎమ్మార్వో నిర్దాక్షిణ్యంగా కూల్చివేసిన సంగతి తెలిసిందే. కానీ, ఏ అధికార బలంతోనో గానీ, అదే అక్రమ నిర్మాణదారుడు మళ్లీ అదే స్థలంలో యథేచ్ఛగా నిర్మాణాన్ని ప్రారంభించాడు. భూమి ధరలు ఆకాశాన్నంటుతుండడంతో, ప్రభుత్వ భూమిని ఎలాగైనా నొక్కేయాలనే స్కెచ్‌తో నిర్మాణదారుడు రెచ్చిపోతున్నాడు. ఈ విషయమై ప్రముఖ దినపత్రికల ద్వారా, ఫోన్ల ద్వారా స్థానిక ఆర్‌ఐకి పదే పదే సమాచారం అందించినా, ఆయన చర్యలు తీసుకోకుండా వెనకడుగు వేయడం వెనుక ఉన్న మర్మమేంటని ప్రజలు నిలదీస్తున్నారు.

**పది రోజులుగా జేసీబీ దొరకట్లేదా? ఎంత హాస్యాస్పదం!**
"అక్రమ నిర్మాణాన్ని కూల్చడానికి గత పది రోజులుగా స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు ఒక జేసీబీ దొరకట్లేదట! ఇంతకంటే పచ్చి అబద్ధం, హాస్యాస్పదమైన విషయం మరొకటి ఉంటుందా? అధికారుల చిత్తశుద్ధి ఎంత లక్షణంగా ఉందో చెప్పడానికి ఈ కుంటిసాకే నిదర్శనం"అని స్థానికులు తీవ్రంగా దుయ్యబడుతున్నారు.

**కబ్జాదారుడికి సలహాలు.. భారీగా చేతులు మారిన ముడుపులు?**
నిర్మాణదారుడిని వెనకుండి నడిపిస్తున్నదే స్థానిక ఆర్‌ఐ అని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు."త్వరగా నిర్మాణం పూర్తి చేసి కోర్టు నుండి స్టే ఆర్డర్ తెచ్చుకోండి.. అంతవరకు నేనే చూసుకుంటా" అంటూ సదరు అధికారి కబ్జాదారుడికి లీగల్ అడ్వైజర్‌లా సలహాలు ఇచ్చారని, స్టే ఆర్డర్ వచ్చే వరకు రక్షణ కల్పించేలా ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అండదండల కోసమే సదరు నిర్మాణదారుడి నుండి ఆర్‌ఐ భారీగా ముడుపులు అందుకున్నట్లు స్థానికంగా గట్టి చర్చ నడుస్తోంది.

**'హైడ్రా' రూల్స్ ఇక్కడ వర్తించవా?**
ప్రభుత్వ భూములను, చెరువులను కాపాడటం కోసం తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా "హైడ్రా" లాంటి ప్రత్యేక విభాగాలను తీసుకొచ్చి, కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తుంటే.. ఇక్కడ కూకట్‌పల్లి ఆర్‌ఐ పుణ్యమా అంటూ అవేమీ పని చేయడం లేదని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. ప్రభుత్వ చట్టాలన్నా, ఉన్నతాధికారులన్నా ఈ ఆర్‌ఐకి అస్సలు భయం లేదా అని ప్రశ్నిస్తున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించకుంటే భూమి కనుమరుగే!**
ఇలాగే నిర్లక్ష్యంగా వదిలేస్తే, సర్వే నెంబర్ 336లోని కోట్ల విలువైన ప్రభుత్వ భూమి పూర్తిగా కనుమరుగైపోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన స్థానిక ఆర్‌ఐపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే అక్రమ నిర్మాణాలను తక్షణమే కూల్చివేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానిక ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

# పరారీలో ఉన్న రౌడీ షీటర్ అరెస్ట్

- నిందితుడి నుండి గంజాయి స్వాధీనం







**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 14 (పీపుల్స్ న్యూస్) :**
గతంలో జరిగిన ఓ హత్య కేసులో పరారీలో ఉన్న రౌడీ షీటర్ ను సైఫాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ (ఖైరతాబాద్ జోన్ బృందం) అధికారులు జరిపిన దాడిలో, గత 2025 జూన్ 5 నుండి పరారీలో ఉన్న లేక్ పోలీస్ స్టేషన్ రౌడీ షీటర్ సోమాజిగూడ ఎం.ఎస్ మఖ్తా కు చెందిన మహ్మద్ షేక్ జావేద్(33) ను అదుపులోకి తీసుకున్నారు. గతంలో సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసు లో ఇతను ఐదవ ముద్దాయి గా ఉన్నాడు. ఈ కేసులో ఇతనిపై కోర్టు నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఆ అరెస్ట్ , వారెంట్ నుండి తప్పించుకోవడానికి, నిందితుడు తన అసలు గుర్తింపును దాచిపెట్టి పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు బాబా వేషధారణలోకి మారాడు.ఖచ్చితమైన సమాచారం అందుకున్న ఖైరతాబాద్ టాస్క్‌ఫోర్స్ బృందం , సైఫాబాద్ పోలీస్ సిబ్బంది సంయుక్తంగా సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నానా మియా మసీదు సమీపంలో గల పూల్ బాగ్ ప్రాంతానికి చేరుకుని, నిందితుడు మహ్మద్ షేక్ జావేద్‌ను విజయవంతంగా అదుపులోకి తీసుకున్నారు. ఈ తనిఖీలలో నిందితుడి వద్ద ఉన్న ఒక పాలిథిన్ క్యారీ బ్యాగ్ నుండి సుమారు 115 గ్రాముల ఎండు గంజాయితో పాటు, అతను మారువేషం కోసం ఉపయోగించిన ఆకుపచ్చ రంగు పీర్ బాబా దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.తదుపరి విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరిస్తూ.. తనపై ఉన్న రౌడీ షీట్ నుండి తప్పించుకోవడానికి, పోలీసుల కన్నుగప్పి తన గుర్తింపును దాచాలనే ఉద్దేశంతో జనవరి 2026 నుండి హైదరాబాద్ వదిలి పారిపోయినట్లు తెలిపాడు. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా చెరియాల్ రోడ్డు సమీపంలోని తన అమ్మమ్మ ఇంట్లో తలదాచుకుంటూ, బాబా అవతారమెత్తి సంగారెడ్డి జిల్లా కంది మండలం, చెరియాల్ రోడ్డు వద్ద ఉన్న జిందేషా మదార్ దర్గాలో పూజారిగా పనిచేస్తున్నట్లు వెల్లడించాడు. రౌడీ షీటర్‌ను అరెస్ట్ చేసి తదుపరి న్యాయపరమైన రిమాండ్ నిమిత్తం కోర్టు ముందు ప్రవేశపెట్టారు. హైదరాబాద్ సిటీ కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ ఖైరతాబాద్ జోన్ ఇన్‌స్పెక్టర్ పి. రాఘవేందర్ పర్యవేక్షణలో, ఖైరతాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఎస్.ఐ ఎ. కృష్ణ, ఎస్.ఐ హెచ్. నరేష్, ఎస్.ఐ ఎమ్. సత్యనారాయణ, సైఫాబాద్ పోలీస్ సిబ్బంది, ఖైరతాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ జి. పురుషోత్తం , ఇతర సిబ్బంది అత్యంత చురుగ్గా పాల్గొని ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు.

# నార్సింగి గ్రామంలో 30కు పైగా సీఎం రిలీఫ్ ఫండ్ సిఎం రిలీప్ పండ్ (సి. ఎం ర్ ఫ్ )చెక్కుల పంపిణీ

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేత



**పాపన్నపేట, జూలై 14** మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నార్సింగి గ్రామ ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సి ఎం ర్ ఫ్ ) ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామానికి ఇప్పటివరకు సుమారు 30కు పైగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరుకాగా, వాటిని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పుంటికూర నారాయణ గౌడ్ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతోందని అన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వై. నర్సింలు, చాకలి నర్సింలు, వార్డు సభ్యుడు శ్రీరామ్ నవీన్ పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. గ్రామ ప్రజలు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అవసరమైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి కొనసాగుతుందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.


# మరెల్లి అనిల్ ప్రథమ వర్ధంతి ఘనంగా నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు




**మెదక్ జూన్ 14**
కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో దివంగత నాయకులు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మరెల్లి అనిల్ ప్రథమ వర్ధంతి వేడుకలు స్వగృహమైన పైతరం గ్రామంలో ఘనంగా జరిగాయి ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.?పార్టీకి అనిల్ చేసిన సేవలు అనన్య సామాన్యం
ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశం గౌడ్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏళ్ళుగారి శ్రీనివాస్ మాట్లాడుతూ?కొల్చారం మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరెల్లి అనిల్ చేసిన సేవలు ఎంతో గుర్తుంచుకోదగినవని తెలిపారు
ఆయన హఠాన్మరణం పార్టీకి తీరని లోటని పేర్కొంటూ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.
అనిల్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.
త్వరలోనే కాంగ్రెస్ పార్టీ అధిష్టానంతో మాట్లాడి, కుటుంబాన్ని ఆర్థికంగా, అన్ని విధాలా ఆదుకోవడానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో
చందాపురం మధుసూదన్ రెడ్డి
బండి మల్లేశం మండల బీసీ సెల్ అధ్యక్షులు
అచ్చెనపల్లి శ్రీరాములు మండల కిసాన్ సెల్ అధ్యక్షులు
కుమ్మరి భూమేష్ గ్రామ శాఖ అధ్యక్షులు
లక్ష్మీనారాయణ, ఇబ్రహీం, శేఖర్, ప్రభాకర్, మహేష్, స్వామి, ఉపేందర్ గౌడ్ పాల్గొన్నారు

# చేగుంట మహంకాళి ఆలయంలో పసుపు అభిషేకాలుశ్రీ వారాహి గుప్త నవరాత్రులు

**చేగుంట జులై 14**
చేగుంట పట్టణ కేంద్రంలోని శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో లోక కళ్యాణార్థం అమావాస్య, మంగళవారం పురస్కరించుకుని శ్రీ మహంకాళి అమ్మవారికి 21 పసుపులతో విశేష అభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చేగుంట మండల గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, రైతులు, అన్నదాతలు అందరూ సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ దేవాలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ పురంలో రాఘవేంద్ర శర్మ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలను అంగరంగ వైభవంగా జరిపించారు. ఇదే సందర్భంలో శ్రీ వారాహి నవరాత్రులు (గుప్త నవరాత్రులు) ప్రారంభమవుతున్నందున భక్తజనులందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి సేవలో పాల్గొని




అనుగ్రహాన్ని పొందాలని అర్చకులు కోరారు. ఇట్టి పవిత్ర నవరాత్రి మహోత్సవాలను దేవాలయ చైర్మన్, ఆలయ కమిటీ సభ్యులు, చేగుంట గ్రామ ప్రజలందరూ ఏకతాటిపై నిలబడి అంగరంగ వైభవంగా విజయవంతం చేయవలసిందిగా రాఘవేంద్ర శర్మ పంతులు పిలుపునిచ్చారు.

## ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి.





**రామచంద్రాపురం, జూలై 14:**
నూతన దేవాలయాల నిర్మాణాలకు, అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని వెలిమెల తండాలో గల భవాని మాత దేవాలయంలో విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి సొంత నిధులతో నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, తాండా ప్రజలు పాల్గొన్నారు.

## గణేష్ గడ్డ ఆలయంలో భక్తుల రద్దీ - భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పిస్తున్నామన్న ఆలయ అధికారులు






**పటాన్‌చెరు, జూలై 14:**
"నేడు మంగళవారం, దీనికి తోడు అమావాస్య కలిసి రావడంతో పటాన్‌చెరు పరిధిలోని రుద్రారం గ్రామంలో సుప్రసిద్ధ గణేష్ గడ్డ ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం అంతా కిక్కిరిసిపోయింది. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో లావణ్య , అధికారులు మాట్లాడుతూ.. 'మంగళవారం మరియు అమావాస్య కావడంతో భక్తుల రద్దీ సాధారణం కంటే అధికంగా ఉంది. భక్తులు ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకునేలా అన్ని ఏర్పాట్లు చేశాం. ఈవో లావణ్య పర్యవేక్షణలో తాగునీరు, క్యూలైన్లు మరియు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాము. రద్దీని దృష్టిలో ఉంచుకుని స్థానిక పోలీసుల సహకారంతో ట్రాఫిక్ నియంత్రణ చేస్తున్నాం. భక్తులు తమ మొక్కులు చెల్లించుకునేందుకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రాంగణమంతా అత్యంత ఆధ్యాత్మిక వాతావరణంతో వెల్లివిరుస్తోంది' అని తెలిపారు. భక్తులందరూ సహకరించి, క్రమపద్ధతిలో క్యూలైన్లలో వచ్చి స్వామివారిని దర్శించుకోవాలని, అధికారులకు సహకరించాలని ఆలయ కమిటీ కోరుతోంది."

# ఆషాఢ మాస బోనాల ఉత్సవాలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి

● నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్






**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 14 (పీపుల్స్ న్యూస్):**
హైదరాబాద్ నగరం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరుపుకొనే ఆషాఢ మాస బోనాల ఉత్సవాలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ఆదేశించారు. ఈ నెల 16 నుంచి ఆగస్టు 13 వరకు కొనసాగే చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ పండుగను భక్తులు అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకొనేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు. బంజారాహిల్స్ లోని టీజీఐసీసీసీ వేదికగా.. గోల్కొండ, బల్కంపేట, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ తదితర ఆలయాల్లో జరిగే బోనాల ఉత్సవాల బందోబస్తు ఏర్పాట్లపై మంగళవారం ఆయన ఉన్నతాధి కారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో తీసుకుంటున్న భద్రతా చర్యలను ఈ సందర్భంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ గోల్కొండ బోనాలతో ప్రారంభమయ్యే ఈ ఉత్సవాల్లో రాబోయే 15 రోజులు అత్యంత కీలకమని గుర్తు చేశారు. ఆయా ఆలయాల వద్ద భక్తుల రద్దీకి అనుగుణంగా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. హైదరాబాద్ ఆషాఢ మాస బోనాల ఏర్పాట్లపై మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశాలు నిర్వహించి భక్తుల భద్రత విషయంలో జారీ చేసిన ఆదేశాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. మంత్రుల ఆదేశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని, వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో భక్తులందరూ అమ్మవార్లను ప్రశాంతంగా దర్శిం చుకునేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా టాస్క్ ఫోర్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సిటీ ఆర్మ్డ్ రిజర్వ్, క్విక్ రియాక్షన్ టీమ్స్ తో పాటు స్థానిక పోలీసులను భారీగా మోహరిస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు భక్తులకు అవసరమైన సమాచారాన్ని చేరవేసేందుకు వీలుగా ఆలయాల పరిసరాల్లో పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలన్నారు. బోనాల ఉత్సవాలకు మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని, వారి భద్రతకు హైదరాబాద్ సిటీ పోలీస్ అత్యంత ప్రాధాన్యమిస్తుందని స్పష్టం చేశారు. గత ఉత్సవాల్లో మహిళలను వేధించిన 644 మంది ఆకతాయిలను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న విషయాన్ని గుర్తు చేస్తూ.. ఈసారి కూడా షీ టీమ్స్ ద్వారా నిరంతర నిఘా కొనసాగించాలన్నారు. గొలుసు దొంగతనాలు, మొబైల్ స్నాచింగ్, జేబు దొంగతనాలు, ఈవ్ టీజింగ్ వంటి నేరాలకు ఆస్కారం లేకుండా నివారణా చర్యలు చేపట్టాలన్నారు. దేవాలయాల పరిసరాల్లో భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బోనాల ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలు, ఘటాల ఊరేగింపు వంటి క్రతువులు శాంతియుతంగా సాగేలా తగినంత మంది సిబ్బందిని రంగంలోకి దించాలన్నారు. గత పండుగల తరహాలోనే ఈ బోనాల మహోత్సవ బందోబస్తును కూడా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఐసీసీసీ నుంచి అదనపు సీపీ (లా అండ్ ఆర్డర్ సౌత్ రేంజ్ ) తఫ్సీర్ ఇక్బాల్, డీసీపీ (అడ్మిన్) వెంకటలక్ష్మి, అదనపు డీసీపీ ఎస్బీ నర్సింహారావు పాల్గొనగా.. అదనపు సీపీ (క్రైమ్స్) శ్రీనివాసులు, జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయల్ డేవిస్, తో పాటు అన్ని జోన్ల లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఎస్హెచ్ఓలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

# ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలను పాటించాలి







**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 14 (పీపుల్స్ న్యూస్) :**
ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలను పాటించాలని గోషామహల్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్ అన్నారు. విద్యార్థుల భద్రతను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో బండ్లగూడలోని శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ లో మంగళవారం స్కూల్ బస్సు డ్రైవర్లు, ఆయాలకు ఒక సమగ్ర ట్రాఫిక్ అవగాహన సదస్సును నిర్వహించారు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ , గోషామహల్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సదస్సులో పాఠశాల రవాణా విభాగానికి చెందిన మొత్తం 50 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ , సురక్షిత ప్రయాణ విధానాలపై సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. తప్పనిసరిగా పాటించాల్సిన ట్రాఫిక్ సైన్‌బోర్డులు , హెచ్చరిక సైన్‌బోర్డులు, సమాచార సైన్‌బోర్డులు, రోడ్డు మార్కింగ్‌ల ప్రాధాన్యత, వాహన వెనుక భాగాలను గమనించే అద్దాల , ప్రాముఖ్యత, సురక్షితమైన ఓవర్‌టేకింగ్ పద్ధతులు , ఓవర్‌టేక్ చేసే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బస్సు ఎక్కేటప్పుడు , దిగేటప్పుడు విద్యార్థుల విషయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, అలాగే విద్యార్థుల భద్రతను పర్యవేక్షించడంలో ఆయాలు/వాహన అసిస్టెంట్ల బాధ్యతలు , విధులు, రౌండ్‌అబౌట్‌లు (రోటరీలు) ఉన్నచోట పాటించాల్సిన నియమాలు , సురక్షితంగా వాహనాన్ని నడిపే విధానం. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు వాటి వల్ల కలిగే తీవ్ర పరిణామాలు , సాధారణ రోడ్డు భద్రతా సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, శ్రీ విద్యా రణ్య ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమావిశ్వనాధన్ , ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


# డీజీపీ సి.వి. ఆనంద్‌ను కలిసిన అంతర్జాతీయ బాక్సర్ డీఎస్పీ నిఖత్ జరీన్






**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 14 (పీపుల్స్ న్యూస్) :** అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి భారతదేశానికి, తెలంగాణ రాష్ట్రానికి ఎనలేని గౌరవాన్ని తీసుకువచ్చారని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి.వి. ఆనంద్ ప్రశంసించారు. అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన బాక్సింగ్ ఛాంపియన్, తెలంగాణ పోలీసు శాఖలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా విధులు నిర్వహిస్తున్న నిఖత్ జరీన్ సోమవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీజీపీ సి.వి. ఆనంద్ నిఖత్ జరీన్ సాధించిన విశిష్ట విజయాలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఆమె విజయాలు తెలంగాణ యువతకు, ముఖ్యంగా మహిళా క్రీడాకారిణులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ జాతీయ, అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి తెలంగాణకు, దేశానికి, తెలంగాణ పోలీసు శాఖకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇప్ప టివరకు కనబరిచిన క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతోనే ముందుకు సాగాలని ఆమెకు సూచించారు. తాను కూడా క్రీడా కారుడిగా ఉన్న అనుభవాన్ని పంచుకున్న డీజీపీ, క్రీడల్లో విజయం సాధించాలంటే కఠినమైన క్రమశిక్షణ, నిరంతర శ్రమ, శారీ రక దృఢత్వం, మానసిక స్థైర్యం అత్యంత అవసరమని అన్నారు. లక్ష్యంపై ఏకాగ్రతతో ముందుకు సాగుతూ యువతకు ఆదర్శ ంగా నిలవాలని, ఒకవైపు పోలీసు అధికారిణిగా బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూనే మరోవైపు అంతర్జాతీయ బాక్సింగ్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిఖత్ జరీన్ మాట్లాడుతూ తన క్రీడా ప్రతిభను గుర్తించి డి ప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా అవకాశం కల్పించిన తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ పోలీసు శాఖకు హృద యపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకాన్ని తాను ఒక గొప్ప గౌరవంగా, మరింత బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నా రు. భారతదేశానికి మరిన్ని పతకాలు సాధించి, తెలంగాణ రాష్ట్రానికి, తెలంగాణ పోలీసు శాఖకు అంతర్జాతీయ వేదికలపై మరింత గౌరవం తీసుకురావడానికి శక్తివంచన లేకు ండాకృషి చేస్తానని నిఖత్ జరీన్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఫీజు రియంబర్స్మెంట్ స్కీమును రద్దు చేయాలనే ప్రభుత్వ కుట్రను విరమించుకోవాలి



**కూకట్ పల్లి, :** జాతీయ బీసీ సంక్షేమ సంఘం, జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో కూకట్పల్లి ధర్నా చౌక్ వద్ద సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఫీజు రియంబర్స్మెంట్ స్కీమ్ రద్దు కుట్ర విరమించుకోవలని, పాత విధానం ద్వారా యథాతథంగా కొనసాగించలని, ప్రభుత్వం కాలేజీలకు చెల్లించాల్సిన ?8,000 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈ బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఉన్నత విద్య కోసం ఫీజు రియంబర్స్మెంట్ చాలా కీలకం. బకాయిలు పెండింగ్ వల్ల చాలా కాలేజీలు సీట్లు ఇవ్వడం ఆపేస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జి. బ్రహ్మేంద్ర – తెలంగాణ బీసీ విద్యుత్ ఉద్యోగాల సంస్థ రాష్ట్ర కార్యనిర్వాఖ అధ్యక్షులు తెల్ల హరికృష్ణ – తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకులు, జర్నలిస్టు
గుజ్జ సత్యం, నీలగోపాల్, మల్లేష్ యాదవ్, రామ్మూర్తి గౌడ్, పృధ్వీ గౌడ్, నిఖిల్, గోపాల్, సిహెచ్ ప్రకాష్ ఉద్యమ గాయకులు రామలింగం బృందం పాల్గొన్నారు.

# పెండింగ్ లో ఉన్న పనులను సైతం త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం

### - నగర మాజీ గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్

**అడ్డగుట్ట, జూలై 14 (పీపుల్స్ న్యూస్) :** పెండింగ్ లో ఉన్న పనులను సైతం త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామని నగర మాజీ గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్ అన్నారు. తుకారం గేట్ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద జెట్ ప్యాచర్ ద్వారా జరుగుతున్న బీటీ రోడ్డు మరమ్మత్తు పనులను నగర మాజీ గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా లింగాని శ్రీనివాస్ మాట్లాడుతూ సికింద్రాబాద్ ఎమ్మెల్యే తిగుళ్ల పద్మారావు గౌడ్ ప్రత్యేక చొరవతో అడ్డగుట్ట డివిజన్ లో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని ఆయన తెలిపారు. డివిజన్ లోని దాదాపుగా అన్ని ప్రాంతాల్లో కొత్త రోడ్లను వేశామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీశ్రేణులు నక్కమధు, విజయకుమారి,భాగ్య,సురేందర్, బాబు, జిహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ సలీం పాల్గొన్నారు.



# కేసీఆర్ ను కలిసిన చిర్రా రవీందర్ యాదవ్



**శేరిలింగంపల్లి, :** భారాస అధినేత కేసీఆర్ ను శేరిలింగంపల్లి ఉద్యమకారులు చిర్రా రవీందర్ యాదవ్ కలిశారు. ఏఐజీ హాస్పిటల్ లో హిమాన్షును పరామర్శించిన అనంతరం తిరుగు పయనం అవుతున్న సందర్భంలో చిర్రా రవీందర్ యాదవ్ కేసీఆర్ ను ప్రత్యేకంగా కలిశారు. చిర్రా రవీందర్ యాదవ్ ను చూసిన కేసీఆర్ బాగున్నావా అంటూ పలకరించారు. చిర్రా రవీందర్ యాదవ్ భుజం తట్టి కేసీఆర్ ప్రోత్సాహాన్ని అందించారు. యువకుడివి, మరింత దూసుకువెళ్లాలని చిర్రా రవీందర్ యాదవ్ కు సూచించారు. సరదాగా కొద్ది సేపు కేసీఆర్ ముచ్చటించారు. అనంతరం చిర్రా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. కేసీఆర్ చేసిన సంక్షేమాన్ని ఎవరూ చెరపలేరని, వచ్చే ఎన్నికల్లో బంపర్ మెజార్టీ సాధిస్తామన్నరు. కేసీఆర్ ను ప్రజలు మరోసారి సీఎంగా కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. తమ అధినేత కేసీఆర్ ను సీఎంగా గెలిపించుకుంటామన్నారు. అంతేకాదు, శేరిలింగంపల్లిలో గులాబీ జెండా రెపరెపలాడబోతుందని, పార్టీ బలోపేతం దిశగా కృషి చేస్తున్నామని చిర్రా రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో బంపర్ మెజార్టీని సాధిస్తామని వెల్లడించారు.

# 24 క్యారెట్లు పేరుతో 18 క్యారెట్ల బంగారం విక్రయం..?


- ప్రజలను మోసం చేస్తున్న బంగారం వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- తాండూరులో పలువురు జువెలరీ షాపులపై ఆరోపణలు
- జిల్లా కలెక్టర్, పోలీసు అధికారులు విచారణ చేపట్టాలని అంబేద్కర్ ప్రజా సంఘం డిమాండ్

**తాండూరు, జూలై 14: (పీపుల్స్ న్యూస్)** ప్రజలను నమ్మించి అధిక ధరలకు నాసిరకం ప్యూరిటీ గల బంగారు ఆభరణాలను విక్రయిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్న బంగారం వ్యాపారులపై సమగ్ర విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ ప్రజా సంఘం తాండూరు డివిజన్ కార్యదర్శి బుడగ జంగం వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాండూరు పట్టణంలో బంగారు ఆభరణాల కొనుగోలులో జరుగుతున్న అక్రమాలు, వినియోగదారుల మోసాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తాండూరు పట్టణంలోని మురుషాద్ దర్గా ప్రాంతానికి చెందిన ఎండి. టిప్పు సుల్తాన్ అనే వ్యక్తి గత మే 26న స్థానిక సరాఫ్ బజార్‌లోని జీపీ జువెలర్స్ దుకాణంలో మహిళలకు సంబంధించిన మూడు గ్రాముల బంగారు టాప్స్‌ను కొనుగోలు చేశారు. ఆ సమయంలో షాప్ యజమాని 24 క్యారెట్ల బంగారానికి ఉన్న ధర ప్రకారం లెక్కించి, మేకింగ్ ఛార్జీలతో కలిపి మొత్తం రూ.46,050 వసూలు చేసినట్లు తెలిపారు.
అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం జీఎస్టీ బిల్లు ఇవ్వకుండా, దుకాణం పేరు ముద్రించిన సాధారణ కాగితంపై మాత్రమే బిల్లు ఇచ్చి, అందులో కూడా 22 క్యారెట్లు అని నమోదు చేసినట్లు ఆరోపించారు. ఇదే విధంగా తాండూరు పట్టణంలోని మహాలక్ష్మీ జువెల్లర్స్, పవన్ జువెల్లర్స్ దుకాణాల్లో కూడా బంగారు ఆభరణాలు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. కొంతకాలం తర్వాత అత్యవసరంగా డబ్బులు అవసరమవడంతో బాధితుడు ఆ ఆభరణాలను విక్రయించేందుకు మరో జువెలరీ షాపుకు తీసుకెళ్లగా, అవి 24 క్యారెట్ల బంగారం కాదని, కేవలం 18 క్యారెట్ల ప్యూరిటీ మాత్రమే ఉన్నట్లు అక్కడి నిపుణులు గుర్తించినట్లు తెలిపారు. దీంతో అనుమానం వచ్చిన బాధితుడు హైదరాబాద్‌లోని అధికారిక గోల్డ్ టెస్టింగ్ కేంద్రంలో ఆభరణాలను పరీక్షించగా, ల్యాబ్ నివేదికలో కూడా అవి 18 క్యారెట్ల ప్యూరిటీమాత్రమే లిగి ఉన్నట్లు నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు. దీంతో 24 క్యారెట్ల బంగారం పేరుతో అధిక ధర వసూలు చేసి, తక్కువ ప్యూరిటీ గల బంగారం విక్రయించి తనను దారుణంగా మోసం చేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేసినట్లు బుడగ జంగం వెంకటేష్ తెలిపారు. ఇది ఒక్క వ్యక్తికే పరిమితం కాకుండా మరెందరో వినియోగదారులు ఇలాంటి మోసాలకు గురై ఉండే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వ్యవహారంపై బాధితుడు గతంలో మే 5న మరియు జూన్ 24న తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో రెండు విడతలుగా లిఖితపూర్వక ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రజలను నమ్మించి తప్పుడు ప్యూరిటీతో బంగారు ఆభరణాలను విక్రయిస్తూ మోసాలకు పాల్పడుతున్న జువెలరీ షాపుల యజమానులపై వినియోగదారుల పరిరక్షణ చట్టాలు, న్యాయ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాండూరు పట్టణంలో నకిలీ బంగారం, తప్పుడు ప్యూరిటీ, బిల్లుల జారీ విషయంలో జరుగుతున్న అక్రమాలపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని, జిల్లా కలెక్టర్, పోలీసు అధికారులు, సంబంధిత శాఖలు సంయుక్తంగా విచారణ చేపట్టి నిజానిజాలు వెలికితీసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అలాగే బంగారం కొనుగోలు చేసే ప్రతి వినియోగదారుడు తప్పనిసరిగా హాల్‌మార్క్ ముద్ర, ప్యూరిటీ వివరాలు, జీఎస్టీ బిల్లు పరిశీలించి కొనుగోలు చేయాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో అజర్, పార్వత్ రెడ్డి, కలిమ్, ఫారుక్ తదితరులు పాల్గొని వినియోగదారుల హక్కులను పరిరక్షించేందుకు అధికారులు వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేశారు.



# విద్యార్థి నాయకుల అక్రమ అరెస్టులను ఖండించండి

### -యంసిపిఐ (యు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి



**హైదరాబాద్ : జూలై 14 (పీపుల్స్ న్యూస్)** విద్యారంగం లో ఉన్న సమస్యలను, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సచివాలయం ముట్టడి కార్యక్రమానికి వెళ్లిన వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులను అర్ధరాత్రి పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు లు చేయడాన్ని యంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు తీవ్రంగా ఖండించారు.
అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గడ్డం నాగార్జునను హన్మకొండ లో రాష్ట్ర నాయకులు మాలోతు జబ్బర్ నాయక్ ఇతర జిల్లా నాయకత్వాన్ని కామారెడ్డి లో, కామ్రేడ్ సబ్బని రాజేంద్ర ప్రసాద్,పసులేటి వెంకటేష్ లను మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి లో, కామ్రేడ్ నాగరాజు వరంగల్ జిల్లా నల్లబెల్లి లో , వరంగల్ నగరంలో చుక్క ప్రశాంత్ ను వివిధ జిల్లాల నాయకత్వం ను అరెస్టు చేయడం రాష్ట్ర ప్రభుత్వం యొక్క అప్రజాస్వామిక చర్యను బట్టబయలు చేస్తున్నదఅని, ప్రశ్నించే విధానాన్ని,నిరసన హక్కు ను కాలరాసే చర్యలను యంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదఅని తక్షణమే విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి నాయకులతో చర్చలు చేయాలని, అరెస్టు చేసిన విద్యార్థి నేతలను బేషరతుగా విడుదల చేయాలని గాదగోని రవి డిమాండ్ చేశారు.

బుధవారం, జూలై 15, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక







# పరదాల మాటున అక్రమ నిర్మాణం

## ఆర్మీకు కేటాయించిన ప్రభుత్వ భూమిపైనా కబ్జాల నీడ..!

## 307 సర్వేలో ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలం ఆక్రమణ.

**కుత్బుల్లాపూర్ జూలై 14 (పీపుల్స్ న్యూస్)**
కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం ప్రాంతంలోని సర్వే నంబర్ 307లో ఉన్న సుమారు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గతంలో ఈ భూమిని ఆర్మీ విభాగం అవసరాల కోసం ప్రభుత్వం కేటాయించినట్లు పేర్కొంటూ జీవో జారీ చేసింది. అయినప్పటికీ కొందరు ఆక్రమణదారులు ఎలాంటి భయం లేకుండా ప్రభుత్వ స్థలాన్ని ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రభుత్వ భూమిని ప్రైవేట్ ఆస్తిగా చూపిస్తూ అమాయక ప్రజలకు విక్రయించడం ద్వారా కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు వాస్తవాలు తెలియని పేద, మధ్యతరగతి



కుటుంబాలు జీవితాంతం కూడబెట్టిన సొమ్ముతో ప్లాట్లు కొనుగోలు చేసి చివరకు మోసపోతున్న పరిస్థితి నెలకొన్నదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గతంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం కఠిన చర్యలు చేపట్టిన హైడ్రా, ఈ వ్యవహారంలో ఎందుకు స్పందించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వానికి చెందిన విలువైన భూమిపై జరుగుతున్న అక్రమాలపై హైడ్రా, రెవెన్యూ, పోలీసు శాఖలు సంయుక్తంగా విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని, ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రభుత్వ స్థలంలో కబ్జా...**
**పరదాలు వెనుక గుడిసెల నిర్మాణం.**
ప్రభుత్వ భూములపై కబ్జాల వ్యవహారం రోజురోజుకూ కొత్త రూపు దాలుస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొదట పాత ఫ్లెక్సీలు, పరదాలు కర్రలు, తాత్కాలిక షెడ్లతో గుడిసెలు ఏర్పాటు చేసి, అనంతరం వాటిని తొలగించి భారీ ఎత్తున శాశ్వత గదులను నిర్మిస్తున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సమాచారం ప్రకారం, నిర్మిస్తున్న ఒక్కో గదిని రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ స్థలమేనన్న విషయం తెలియకుండా పలువురు పేద, మధ్యతరగతి కుటుంబాలు జీవితకాల పొదుపును పెట్టుబడిగా పెట్టి ఈ గదులను కొనుగోలు చేసి మోసపోతున్నారని స్థానికులు చెబుతున్నారు.ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు, ముఖ్యంగా హైడ్రా, వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. తాత్కాలిక గుడిసెల దశలోనే కబ్జాలను అడ్డుకుంటే ప్రభుత్వ భూములు పరిరక్షించబడటంతో పాటు అమాయక ప్రజలు మోసపోకుండా ఉంటారని అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ స్థలాలపై జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఇప్పటికే నిర్మించిన అక్రమ గదుల విక్రయాలను అడ్డుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి.. రెగ్యులరైజేషన్ కోసం

# కోర్టును ఆశ్రయం?

## 59 జీవో కింద రూ 70 లక్షలు. - అడ్డంగా దొరికిన అధికారులు..!

**శేర్లింగంపల్లి : జూలై 14 (పీపుల్స్ న్యూస్)**

శేర్లింగంపల్లి సర్కిల్ పరిధిలోని ప్రభుత్వ భూముల ఆక్రమణ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. సర్వే నంబర్ 111లోని ప్రైవేట్ స్థలానికి రెసిడెన్షియల్ నిర్మాణానికి అనుమతి పొందినప్పటికీ, దానికి ఆనుకుని ఉన్న సర్వే నంబర్లు 108, 110లోని సుమారు 3,751 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి వాణిజ్య (కమర్షియల్) భవనాన్ని నిర్మించిన ఘటన తీవ్ర దుమారం రేగుతుంది. ఈ అక్రమ నిర్మాణాన్ని అనంతరం రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ సదరు కబ్జారాయుడు కోర్టును ఆశ్రయించాడు. అంతేకాకుండా జీవో నెం.59 కింద సుమారు రూ.70 లక్షలు ప్రభుత్వానికి ఫీజు చెల్లించి రెగ్యులర్ చేయాలని మున్సిపల్ అధికారులతో కుమ్మక్కైనట్లు స్పష్టంగా తెలుస్తుంది. ఈ వ్యవహారంలో కొందరు అధికారులు, సంబంధిత వ్యక్తులతో కుమ్మక్కై ప్రభుత్వ భూమిని ప్రైవేట్ స్థలంగా చూపించే ప్రయత్నాలు జరిగాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ అంశంపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి, ప్రభుత్వ భూమి ఎంత మేర ఆక్రమణకు గురైందో తేల్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో నిర్మించిన కమర్షియల్ భవనంపై చర్యలు తీసుకుంటారా? లేక రెగ్యులరైజేషన్ పేరుతో అక్రమాలకు చట్టబద్ధత కల్పిస్తారా? అనే అంశంపై ప్రభుత్వ యంత్రాంగం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.










### అధికారుల్లో మొదలైన భయం..!

హైదరాబాద్, గచ్చిబౌలి ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలకు అండగా నిలిచిన అధికారులపై ఉన్నతస్థాయి విచారణ జరిగే అవకాశముందన్న ప్రచారం అధికారుల వర్గాల్లో కలకలం రేపుతోంది. ప్రభుత్వ భూమిలో భారీ కమర్షియల్ నిర్మాణం చేపట్టిన వ్యవహారంలో సంబంధిత శాఖల అధికారులు తీసుకున్న నిర్ణయాలపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూమిలో నిర్మాణం జరిగినట్లు ఆరోపణలు ఉన్నప్పటికీ, అదే నిర్మాణానికి జీవో నం. 59 కింద ఫీజు ఎలా స్వీకరించారనే అంశంపై పలువురు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ప్రభుత్వ స్థలంపై నిర్మాణం జరిగితే దానిని క్రమబద్ధీకరించే అవకాశం ఎలా కల్పిస్తారో.. దానిపై స్పష్టత ఇవ్వాలని స్థానికులు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి. గతంలో అక్రమంగా ఆక్రమించిన భూముల్లో నిర్మించిన ఫామ్‌హౌస్‌లను హైడ్రా అధికారులు కూల్చివేసిన విషయం తెలిసిందే. అలాంటి చర్యలు చేపట్టిన హైడ్రా, గచ్చిబౌలిలోని సర్వే నెంబర్లు 108, 110 పరిధిలో ప్రభుత్వ భూముల్లో నిర్మించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న భారీ నిర్మాణాల విషయంలో ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ, మున్సిపల్, టౌన్ ప్లానింగ్ తదితర శాఖల అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను ప్రజల ముందుంచాలని సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండకూడదని, అక్రమాలకు పాల్పడిన వారితో పాటు సహకరించిన అధికారులపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

బుధవారం, జూలై 15, 2026 | పీపుల్స్ న్యూస్ దినపత్రిక | 10

# భవ్య పథకం వర్తింపుకు తగిన చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.



**కర్నూలు జూలై 14** భవ్య పథకం వర్తింపుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో ఏపీఐఐసీ కి సంబంధించి భవ్య పథకం కింద భూసేకరణ,గుట్టపాడు వద్ద ఎస్ ఎస్ ట్యాంక్ నిర్మాణం అంశాలపై ఇరిగేషన్, ఏపీఐఐసీ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భవ్య పారిశ్రామిక పథకం వర్తించేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి లొద్దిపల్లి,మీదివేముల వద్ద భూసేకరణ గురించి జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, ఓర్వకల్లు తహసీల్దార్ లతో చర్చించారు. ఇందుకు సంబంధించిన చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా గుట్టపాడు వద్ద ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణం గురించి ఇరిగేషన్, ఏపీఐఐసీ అధికారులతో చర్చించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, నంద్యాల ఇరిగేషన్ ఎస్ ఈ శుభకుమార్, డిఈ కిష్టన్న, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# అడిషనల్ కోర్టు ఏర్పాటుకు భవనాల పరిశీలన..

**- జిల్లా జడ్జి పర్యటన..ఆగస్టు 22న ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని సూచన**



**పత్తికొండ జూలై 14:** పత్తికొండలో మంజూరైన అడిషనల్ కోర్టు ఏర్పాటుకు అవసరమైన భవనాలను జిల్లా జడ్జి మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా పట్టణంలోని గుత్తి రోడ్డులో ఉన్న రైతు సేవా కేంద్రం,సచివాలయాలు4, 6 భవనాలను పరిశీలించి, కోర్టు నిర్వహణకు అనువైన వసతులపై అధికారులతో చర్చించారు. అలాగే కోర్టు కోసం కేటాయించిన స్థలాన్ని కూడా పరిశీలించి, అవసరమైన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.అనంతరం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాదులతో సమావేశమైన జిల్లా జడ్జి, గోనెగండ్ల మండలం ఎమ్మిగనూరు కోర్టు పరిధిలోకి మారుతుందనే ప్రచారానికి తెరదించారు. గోనెగండ్ల మండలం యథావిధిగా పత్తికొండ కోర్టు పరిధిలోనే కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఆగస్టు 22న అడిషనల్ కోర్టు ప్రారంభోత్సవం నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి జోష్ణ దేవి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మధుబాబుకు సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్, రెవెన్యూ సిబ్బంది, పోలీసు అధికారులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదాయానికి 'ప్రైవేటు' గండి..!

- **ఉరవకొండ డిపో సమీపంలో వందకు చేరువలో వాణిజ్య వాహనాలు..**
- **నియంత్రణపై అధికారుల నిర్లక్ష్యమా..?**




**ఉరవకొండజూలై 14** ప్రభుత్వం ఆర్టీసీని బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్న వేళ, ఉరవకొండ అనంతపురం మార్గంలో పెరుగుతున్న ప్రైవేటు వాణిజ్య వాహనాలు సంస్థ ఆదాయానికి భారీ నష్టాన్ని కలిగిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఉరవకొండ డిపో సమీపంలోనే ప్రైవేటు వాహనాలు నిలిపి ప్రయాణికులను తరలిస్తున్నప్పటికీ, సంబంధిత శాఖల పర్యవేక్షణ లోపించిందని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం సుమారు 54 వాహనాలు నిత్యం తిరుగుతున్నాయని, త్వరలో ఈ సంఖ్య వందకు చేరే అవకాశం ఉందని చెబుతున్నారు.ఉరవకొండ నుంచి అనంతపురానికి ఒక్కో ప్రయాణికుడి నుంచి రూ.100 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఒక్కో వాహనం రోజుకు వేల రూపాయల ఆదాయం పొందుతుండగా, ఈ కారణంగా ఆర్టీసీకి రావాల్సిన ఆదాయం గణనీయంగా తగ్గిపోతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.డిపో ఎదుటే వాహనాలు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవడం బహిరంగంగా జరుగుతున్నా అధికారులు సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. రవాణా శాఖ తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధిస్తున్నప్పటికీ, సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని స్థానికులు అంటున్నారు.మరోవైపు చట్టబద్ధంగా పర్మిట్లు, పన్నులు, బీమా, ఫిట్‌నెస్ ధ్రువపత్రాలతో వాహనాలు నడుపుతున్న వారికి నష్టం జరుగుతోందని కొందరు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనధికారికంగా నడుస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ప్రయాణికుల భద్రత, ప్రభుత్వ ఆదాయ పరిరక్షణ కోసం ఆర్టీసీ, రవాణా శాఖ, పోలీసు శాఖలు సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# నిర్మలా ఇంగ్లీష్ మీడియం స్కూల్, కడప నందు "పోలీస్ కళా-జాగృతి బృందం" నాటక ప్రదర్శన

**కడప జూలై 14 :** జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ వారి ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం నిర్మలా ఇంగ్లీష్ మీడియం స్కూల్, కడప నందు "పోలీస్ కళా-జాగృతి బృందం" ఇన్‌చార్జ్ జి.నరసరామ్ మరియు టీమ్ చే 'ఓయువతా మేలుకో" నాటక, పాటల ప్రదర్శన ద్వారా మాధకద్రవ్యాలపై అవగాహన కల్పించారు.ఈసందర్భంగా కడప 2 పట్టణ సిఐ శ్రీహరి మాట్లాడుతూ నేటిసమాజంలో యువత "డ్రగ్స్"కు దూరంగా ఉండి వారి భవిష్యత్తును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మత్తుపదార్థాలు వాడిన, అమ్మిన, ఆశ్రయం కల్పించిన దానికి తగిన శిక్షలు గురించి తెలియజేశారు.మత్తు పదార్థాల ఆచూకీ తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972కి కాల్ చేసి తెలియజేయాలన్నారు.ప్రిన్సిపాల్ విజయారాణి మాట్లాడుతూ మత్తుపదార్థాల వాడకంవల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు, సమాజంలోని రుగ్మతలు వాటివలన కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే మీ తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చి సమాజానికి ఉపయోగపడాలని హితువు పలికారు.ఈగల్ టీమ్ అయూబ్ ఖాన్, గురుశేఖర్ లు విద్యార్థులచే "యువతా మేలుకో-మత్తు నుండి తేరుకో, డ్రగ్స్ వద్దు- జీవితం ముద్దు, మత్తుపదార్థాలకు దూరంగా ఉందాం- భవిష్యత్తును కాపాడుకుందాం" అని నినాదాలు చేయించారు."పోలీసు కళా-జాగృతి బృందం" ప్రదర్శన విద్యార్థులను అలరించింది.ఈ కార్యక్రమంలో స్కూల్ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు మరియు కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజల సానుకూల దృక్పథం 80 శాతానికి చేరాలి

## గ్యాస్ డెలివరీలో అదనపు వసూళ్లపై ఏజెన్సీలకు కలెక్టర్ హెచ్చరిక



**కర్నూలు జూలై 14** జిల్లాలో గ్యాస్ ఏజెన్సీలు ప్రజల విశ్వాసాన్ని పెంపొందించేలా సేవలు అందించి, ప్రజల సానుకూల దృక్పథం (పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్) 80 శాతానికి చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదేశించారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ అదనపు డబ్బులు వసూలు చేస్తే సంబంధిత ఏజెన్సీలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం దీపం-2 పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నప్పటికీ, డెలివరీ సమయంలో అదనపు డబ్బులు వసూలు చేయడం వల్ల ప్రజల్లో ప్రతికూల అభిప్రాయం ఏర్పడుతోందని తెలిపారు.ఇప్పటికే పలుమార్లు సూచనలు, శిక్షణ ఇచ్చినా పరిస్థితిలో మార్పు రాలేదన్నారు.ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఇప్పటికే మూడు గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తీసుకున్నట్లు, కొన్ని ఏజెన్సీలకు రూ.2 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు జరిమానాలు విధించినట్లు వెల్లడించారు. పెద్దకడుబూరుకు చెందిన మాధురి గ్యాస్ ఏజెన్సీపై పలుమార్లు హెచ్చరించినా మార్పు రాకపోవడంతో ఆ ఏజెన్సీ వినియోగదారులను సమీపంలోని మరో ఏజెన్సీకి ట్యాగ్ చేసే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ...గ్యాస్ డెలివరీ బాయ్స్ ఎట్టి పరిస్థితుల్లోనూ అదనపు సొమ్ము వసూలు చేయరాదని, వారికి జీతాలు బ్యాంకు లేదా డిజిటల్ చెల్లింపుల ద్వారానే అందించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్యాస్ ఏజెన్సీల పనితీరు, డెలివరీ సిబ్బంది వివరాలను సమీక్షించారు. జీతాలు, వాహనాల వివరాలను జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయానికి అందజేయాలని ఆదేశించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి రాజా రఘువీర్, ఏడి మార్కెటింగ్ నారాయణమూర్తి, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దారులు, గ్యాస్ కంపెనీల ప్రతినిధులు, ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

# విద్యుత్ మోటార్లను పగలగొట్టి కాపర్ వైర్ చోరీ



**వీరబల్లి జూలై 14 :** మండలంలో విద్యుత్ మోటార్లను పగలగొట్టి వాటిలోని కాపర్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన వీరబల్లి మండలంలోని దిగువ రాచపల్లి పంచాయతీ లో చోటు చేసుకుంది.ఈ వారంలో తోళ్ల గురయ్య కాపర్ వైర్ 120 మీటర్లు, దామోదర్ రెడ్డి కాపర్ వైర్ 10 మీటర్లు, అశోక్ కుమార్ రెడ్డి 10 మీటర్లు, మంజులమ్మ 15 మీటర్లు, ప్రమీలమ్మ 10 మీటర్లు, కృష్ణారెడ్డి 10 మీటర్లు, జై చంద్ర రెడ్డి 15 మీటర్లు, రత్నాకర్ రెడ్డి 10 మీటర్లు, శివారెడ్డి 10 మీటర్లు, ఆమూరి ఈశ్వరయ్య180 మీటర్లుఇంతమంది రైతులకు సంబంధించిన దాదాపు400మీటర్ల కాపర్ వైర్లను గుర్తుతెలియని దుండగులు దొంగలించారు. గ్రామ శివారులో 9 మంది రైతుల మోటార్ల నుంచి వైరు దొంగలించారు. గత కొన్ని రోజులుగా పలు గ్రామాలలో విద్యుత్ మోటార్ల కాపర్ వైర్ చోరీలు జరుగుతుండడంతో రైతులు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మండల ఎస్పై,సీఐ,డి.ఎస్.పి,పోలీస్ వ్యవస్థ దర్యాప్తు చేపట్టాలని వారు కోరారు.

# పెద్ద రంగాపురంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

**- నూతన బోర్ పాయింట్‌ను పరిశీలించిన వైఎస్ మనోహర్ రెడ్డి**



**పులివెందుల జూలై 14 :** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు పెద్ద రంగాపురం గ్రామంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న తాగునీటి సమస్య పరిష్కారానికి వైకాపా మున్సిపల్ ఇంచార్జి వైఎస్ మనోహర్ రెడ్డి చొరవ తీసుకున్నారు.మంగళవారం ఆయన గ్రామస్థులతో కలిసి పర్యటించి,తాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు వీలుగా నూతన బోర్ పాయింట్ ఏర్పాటు చేసే స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా వైఎస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ వార్డులోని ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.అనంతరం గ్రామస్థులతో సమావేశమై, గ్రామంలో నెలకొన్న డ్రైనేజీ, సిమెంట్ రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల నిర్వహణ వంటి పలు ఇతర స్థానిక సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.ప్రజా సమస్యలన్నింటినీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైకాపా ముఖ్య నాయకులు హాల్ గంగాధర్ రెడ్డి, పార్నపల్లి కిషోర్,రామ్ లక్ష్మణ్ రెడ్డి,రామకృష్ణ రెడ్డి, పురుషోత్తం రెడ్డి,జయరామి రెడ్డి,బలక్కగారి ప్రతాప్ రెడ్డి, రామనాథ రెడ్డితో పాటు వార్డు ప్రజలు,వైకాపా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మై భారత్ నేషనల్ ఫస్ట్ ఛాలెంజ్‌లో వెంకట లోకేష్‌కు జాతీయ స్థాయిలో 5వ స్థానం

**- ఏపీ స్థాయిలో ప్రథమ స్థానం**

**- లక్నోలో కేంద్ర మంత్రి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకోనున్న విద్యార్థి**



**వీరబల్లి జూలై 14 :** కడప జిల్లా వీరబల్లి మండలంలోని ఎన్‌డీకేఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థి స్వామికేరి వెంకట లోకేష్ జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు. మై భారత్ పోర్టల్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన నేషనల్ ఫస్ట్ ఛాలెంజ్ ఆన్‌లైన్ పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయిలో 5వ స్థానం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానాన్ని సాధించారు.ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ రవిశేఖర్ రెడ్డి, వీఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ వెంకట లోకేష్ సాధించిన విజయం కళాశాలకు, జిల్లాకు గర్వకారణమని తెలిపారు. ఈ నెల 17న లక్నోలో నిర్వహించే కార్యక్రమంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ చేతుల మీదుగా వెంకట లోకేష్ ప్రశంసాపత్రం అందుకోనున్నట్లు వెల్లడించారు.విద్యార్థి విజయంపై కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ముమ్మరంగా వాహనాల తనిఖీలు..!



**వీరబల్లి జూలై 14 :**మండల కేంద్రం రాయచోటి వీరబల్లి రహదారి యందు స్థానిక ఎస్సై సుస్మిత తన సిబ్బందితో వెళ్లి వాహనాల తనిఖీలను మంగళవారం నిర్వహించినది. ఈ సందర్భంగా ఆమె వాహనాలకు రికార్డులు పరిశీలించడం జరిగింది.రికార్డులు లేని వాహనాలకు జరిమానాలు విధించడం జరిగింది. అదేవిధంగా డ్రైవర్లకు లైసెన్సులు, హెల్మెట్ లేని వారికి కూడా జరిమాణాలు విపించడం జరిగింది.మధ్యాహ్నం నుండి మండల చుట్టుపక్కల రహదారుల యందు వాహనాల తనికెలను చేయడం జరిగింది. అనంతరం ఆమె మాట్లాడుతూ...వాహనాలు నడిపే డ్రైవర్లు ప్రభుత్వ సూచనల మేరకు రికార్డులు, ఇన్సూరెన్స్,లైసెన్సులు తప్పగా కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించి నడపాలన్నారు. ట్రాఫిక్ సూచనలు పాటించని వారిపైన కఠినమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జీవనోపాదుల కల్పనే లక్ష్యంగా పని చేయాలి

**- వెలుగు పిడి రాజ్యలక్ష్మి**

**వీరబల్లి జూలై 14 :**జీవనోపాదుల కలపనే లక్ష్యంగా వెలుగు సిబ్బంది పనిచేయాలని, కడప జిల్లా గ్రామీణా భివృద్ధి సంస్థ పథకసంచాలకులు రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలో ని వెలుగు కార్యాలయంలో సిబ్బందిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె బ్యాంకు, ఉన్నతి, స్త్రీనిధి మరియు ప్రభుత్వ పథకాలైన పి.యం.ఈ.జి. పి.సూక్ష్మ మైక్రో ఉత్పత్తుల తయారీ పరిశ్రమలను అర్హులందరికీ అందించి వారి కుటుంభ ఆధాయాలను రెట్టింపు అయ్యేలా చర్యలు తీసుకువాలన్నారు .ప్రతికుటుంభంలో ఒక పారిశ్రామిక వేత్తలను తయారుచేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.మునగ ప్రాసెస్సింగ్ ద్వారా ప్రతి రైతుకు సంవత్సరానికి 2 లక్షల వచ్చే విధంగా కృషి చే స్తున్నామన్నారు.మునగను ప్రతి ఒక్కరు దైనందిన ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మెలన్నారు. మునగ ప్రాసెసింగ్ కేంద్రాన్ని పరిశీలించి ఆసక్తిగల రైతులతో మునగ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సిబ్బందికి ఆదేశించారు. స్థానిక ఏపీయం ఖాదర్ వలి, సీసీలు కృష్ణయ్య, సుధాకర్, గంగాధరం,నాగేంద్ర, నాగేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

# ఆరుతడి పంటల సాగుకు రైతులు మొగ్గు చూపాలి

**- ఏలినో ప్రభావంతో తక్కువ నీటి పంటలే మేలు**

**- టెక్నికల్ ఏవో మధుసూదన్ రెడ్డి**

**తొండూరు జూలై 14 :**-రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని ముద్దనూరు సబ్ డివిజన్ టెక్నికల్ ఏవో మధుసూదన్ రెడ్డి సూచించారు. తొండూరు గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.రాజు, టెక్నికల్ ఏవో మధుసూదన్ రెడ్డి పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కె.రాజు మాట్లాడుతూ మండలానికి 50 శాతం రాయితీతో కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.టెక్నికల్ ఏవో మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఏలినో ప్రభావం ఎక్కువగా ఉన్నందున తక్కువ నీటితో సాగు చేసే పంటలను రైతులు ఎంచుకోవాలని సూచించారు.

# వన్డేలను 40 ఓవర్లకు కుదిస్తే ఒప్పుకునేది లేదు

## ఇండియా వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్

టి20 ల హవా, రకరకాల ఫ్రాంచైజీ లీగుల ఎఫెక్ట్ వల్ల వన్డే క్రికెట్ ప్రెజెంట్ తీవ్ర సంక్షోభాన్ని ఫేస్ చేస్తోంది. రీసెంట్ గా ఎడిన్‌బర్గ్‌లో జరిగిన ఐసీసీ యాన్యువల్ కాన్ఫరెన్స్ లో వన్డే మ్యాచులను 50 ఓవర్ల నుంచి 40 ఓవర్లకు కుదించేలా మేజర్ డిస్కషన్స్ జరిగాయి. ఈ హాట్ టాపిక్ పై మంగళవారం ఇంగ్లాండ్‌తో జరగబోయే ఫస్ట్ వన్డే మ్యాచ్ కు ముందు జరిగిన ప్రెస్ మీట్ లో ఇండియా వన్డే, టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ చాలా స్ట్రాంగ్ గా రియాక్ట్ అయ్యాడు. వన్డేలను 40 ఓవర్లకు మార్చాలనే ఐడియాను గిల్ కంప్లీట్ గా రిజెక్ట్ చేశాడు. వన్డే ఫార్మాట్ ను మళ్లీ ఇంట్రెస్టింగ్ గా మార్చడానికి బైలాటరల్ సిరీస్ ల కంటే పాత రోజుల్లో లాగా ట్రయాంగులర్ లేదా క్వాడ్రాంగులర్ సిరీస్ లను మళ్లీ స్టార్ట్ చేయాలని గిల్ ఒక క్రేజీ ఐడియాను ఐసీసీ ముందుకు తెచ్చాడు. “వన్డేలను 40 ఓవర్లకు తగ్గించాల్సిన అవసరం అస్సలు లేదు. మేము చిన్నప్పుడు ఆస్ట్రేలియా, ఇండియా, శ్రీలంక జట్ల మధ్య జరిగే ట్రయాంగులర్ సిరీస్ లను విపరీతంగా ఎంజాయ్ చేసేవాళ్ళం. రెండు వేర్వేరు బలమైన జట్లతో డిఫరెంట్ వెన్యూస్ లో తలపడటం వల్ల చూసే ఆడియన్స్ కు, ఆడే ప్లేయర్లకు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ దొరుకుతుంది” అని 26 ఏళ్ల గిల్ అభిప్రాయపడ్డాడు. తన చిన్నతనం అంతా 50 ఓవర్ల క్రికెట్ తోనే సాగిందని, వరల్డ్ కప్ అనగానే ప్రతీ ఒక్కరికీ గుర్తొచ్చేది 50 ఓవర్ల మెగా ఈవెంట్ మాత్రమేనని చెప్పాడు. క్రికెట్ లో ప్రతీ ఒక్కరూ గెలవాలని కలలు కనే మోస్ట్ ప్రెస్టీజియస్ ట్రోఫీ 50 ఓవర్ల వరల్డ్ కప్పేనని గిల్ ఎమోషనల్ గా గుర్తుచేసుకున్నాడు. ఈ వన్డేల భవిష్యత్తు ముచ్చట్లలోనే 2027 లో సౌతాఫ్రికా




వేదికగా జరగబోయే వన్డే వరల్డ్ కప్ ప్లాన్స్ పై గిల్ ఓపెన్ అయ్యాడు. “సౌతాఫ్రికాలో ఉండే వికెట్లు ప్రెజెంట్ ఇంగ్లాండ్ లో మేము ఆడే వికెట్లకు చాలా సిమిలర్ గా ఉంటాయి. కాబట్టి మాకు ఏ కాంబినేషన్ బెస్ట్ గా సెట్ అవుతుందో టెస్ట్ చేయడానికి ఈ ఇంగ్లాండ్ సిరీస్ ఒక పర్ఫెక్ట్ ల్యాండ్‌మార్క్ లాంటిది. వరల్డ్ కప్ ప్రిపరేషన్ లో ఈ మ్యాచ్ లు చాలా కీ రోల్ ప్లే చేస్తాయి” అని కెప్టెన్ చెప్పాడు. ఈ త్రీ-మ్యాచ్ సిరీస్ ద్వారా తన లీడర్‌షిప్ ఎక్స్‌పీరియన్స్ ను మరింత బిల్డ్ చేసుకోవాలని చూస్తున్నట్లు, ప్రతీ మ్యాచ్ నుంచి నేర్చుకునే విషయాలు వరల్డ్ కప్ లో ఎంతో క్రూషియల్ అవుతాయని గిల్ క్లారిటీ ఇచ్చాడు. టీమ్ లో మాటిమాటికీ ప్లేయర్లను మార్చడం వల్ల అన్‌సెటిల్డ్ ఎలెవన్ అనే ఫీలింగ్ రావడం లేదని, యంగ్ ప్లేయర్లకు ప్రెజర్ సిట్యుయేషన్స్ లో ఛాన్సులు ఇస్తేనే వాళ్లు వరల్డ్ కప్ కల్లా పక్కాగా సెట్ అవుతారని గిల్ అన్నాడు. “మేము కొంత అన్‌లక్కీ అని చెప్పాలి. సిరీస్ స్టార్ట్ అవ్వకముందే నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా లాంటి కీ ప్లేయర్లు గాయాల బారిన పడ్డారు. వాళ్లకు ఎక్కువ మ్యాచులు ఆడించి సెటిల్ చేద్దాం అనుకున్నా కుదరలేదు. అందువల్లే డిఫరెంట్ కాంబినేషన్స్ ట్రై చేయాల్సి వచ్చింది తప్ప టీమ్ లో ఎలాంటి ఇన్-స్టెబిలిటీ లేదు” అని గిల్ పక్కాగా చెప్పాడు. వరల్డ్ కప్ లో 11 మ్యాచులు ఆడాల్సి ఉంటుందని, కాబట్టి ఇంగ్లాండ్, న్యూజిలాండ్ లాంటి బిగ్ సిరీస్ లలో యంగ్ ప్లేయర్లు ఒత్తిడిని తట్టుకుని బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇవ్వడం మోస్ట్ ఇంపార్టెంట్ అని కెప్టెన్ గిల్ స్పష్టం చేశాడు.



# మళ్లీ గంభీర్ X కోహ్లీ డిష్యూం డిష్యూం...

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మధ్య మళ్లీ విభేదాలు తలెత్తాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్ ప్రారంభానికి ముందు ఈ ఇద్దరు మాట్లాడుకోవడం లేదనే వార్తలు అభిమానులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. బర్మింగ్‌హామ్ వేదికగా జరిగే తొలి వన్డేలో ఆతిథ్య ఇంగ్లండ్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్ కోసం భారత ఆటగాళ్లు బాగా సన్నదమయ్యారు. నెట్స్‌లో గంటల తరబడి చెమటోడ్చారు. అయితే ప్రాక్టీస్ సెషన్స్‌లో కోహ్లీ, గంభీర్ ఒక్కసారి కూడా మాట్లాడుకోలేదనే పోస్ట్‌లు సోషల్ మీడియా వేదికగా హల్‌చల్ చేస్తున్నాయి. విరాట్ కోహ్లీ నెట్ ప్రాక్టీస్ సెషన్‌ను ప్రత్యేకంగా గమనించిన గంభీర్.. అతనితో నేరుగా మాట్లాడకుండా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్‌కు చెప్పి మరీ మాట్లాడించడం ప్రశ్నార్థకంగా మారింది. ఇందుకు సంబంధించిన వీడియో కూడా నెట్టింట వైరల్‌గా మారింది. ఈ వీడియోలో అనవసర షాట్స్ ఆడబోయిన కోహ్లీ పలుమార్లు క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ప్రాక్టీస్ సెషన్ ముగిసిన తర్వాత కోహ్లీతో గంభీర్ నేరుగా మాట్లాడకుండా బ్యాటింగ్ కోచ్‌తో మాట్లాడించడం ఈ విభేదాల వార్తలకు బలం చేకూరుస్తోంది. ప్రాక్టీస్ సెషన్స్ సందర్భంగా గంభీర్ తరుచూ శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ, బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్‌లతో మాట్లాడినట్లు తెలుస్తోంది. నేరుగా కోహ్లీతో గంభీర్ మాట్లాడిన సందర్భం ఒక్కటి కూడా లేదని ఓ జాతీయ మీడియా పేర్కొంది. ఫైనల్ ప్రాక్టీస్ సెషన్‌లో జట్టులోని ఇతర ఆటగాళ్లందరితో మాట్లాడిన గంభీర్.. కోహ్లీతో మాత్రం మాట్లాడకపోవడం చర్చనీయాంశమైంది. కోహ్లీ కూడా గంభీర్‌తో మాట్లాడే ప్రయత్నం చేయలేదు. దాంతో జట్టులో వాతావరణం అంతా సవ్యంగానే ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలో ఐపీఎల్ సందర్భంగా పలుమార్లు ఈ ఇద్దరూ గొడవపడ్డారు. కానీ గంభీర్ టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రొఫెషనల్ ప్లేయర్లలా కలిసి మెలిసి పనిచేశారు. కానీ ఏమైందో ఏమో తెలియదు కానీ.. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ముందు ఈ ఇద్దరూ మాట్లాడుకోవడం లేదనే వార్తలు అభిమానులను గందరగోళానికి గురి చేస్తున్నాయి. ఇప్పటికే టీ20ల్లో క్లీన్ స్వీప్ అయిన టీమిండియా.. కనీసం వన్డేల్లోనైనా గెలవాలని భావిస్తుంది. ఈ క్రమంలో కోహ్లీ, గంభీర్ మధ్య విభేదాలు మ్యాచ్‌ల ఫలితాలపై ఏ మేర ప్రభావం చూపుతాయోననే ఆందోళన అభిమానుల్లో నెలకొంది.

# కెప్టెన్సీలో ధోని రికార్డును సమం చేసిన శ్రేయస్ అయ్యర్

టి20 ప్రపంచకప్ 2026 నెగ్గిన తర్వాత నుంచి భారత జట్టుకు దరిద్రం పట్టుకున్నట్లు ఉంది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో జరిగిన టి20 సిరీస్‌ల్లో భారత జట్టు ఘోర పరభవాన్ని మూటగట్టుకుంది. మొత్తం 7 మ్యాచ్‌లు జరిగితే.. ఆరింటిలో ఓడింది. మరో మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. ఈ రెండు పర్యటనల్లో భారత జట్టు ఏ మాత్రం ఫైటింగ్ చేయలేకపోయింది. చివరికి ఐర్లాండ్ చేతిలో కూడా ఘోరంగా ఓడింది. తొలిసారి ఐర్లాండ్ చేతిలో సిరీస్‌ను కోల్పోయింది. టి20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత భారత జట్టులో మార్పులు జరిగాయి. సూర్యకుమార్ యాదవ్‌పై వేటు పడింది. ఫలితంగా శ్రేయస్ అయ్యర్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పజెప్పారు. ఈ క్రమంలో శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా ధోని రికార్డును సమం చేశాడు. భారత కెప్టెన్‌గా ఒక్క మ్యాచ్ గెలవని శ్రేయస్ అయ్యర్.. ధోని రికార్డును సమం చేయడం ఏంటంటూ మీరు ఆశ్చర్యపోవచ్చు. అయితే అది నిజం. శ్రేయస్



అయ్యర్ కెప్టెన్సీలో భారత జట్టు 7 టి20లను ఆడింది. ఇందులో ఒక మ్యాచ్ రద్దు కాగా.. మిగిలిన 6 మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. అయితే ఈ 7 మ్యాచ్‌ల్లోనూ టాస్ శ్రేయస్ అయ్యరే గెలిచాడు. వరుసగా 7 టాస్‌లు గెలిచి అందరినీ ఆశ్చర్యపరిచాడు. గతంలో భారత జట్టు వరుసగా టాస్‌లను ఓడిపోయింది. గతేడాది జరిగిన ఆసియా కప్‌లో అయితే సూర్యకుమార్ యాదవ్ టాస్ గెలవడం కోసం లెఫ్టాండ్ తో కూడా స్పిన్ చేశాడు. కానీ, ఓడాడు. అయితే శ్రేయస్ అయ్యర్ మాత్రం కెప్టెన్‌గా 7 టాస్‌ల్లోనూ గెలిచాడు. గతంలో మహేంద్ర సింగ్ ధోని వరుసగా 7 సార్లు టాస్ నెగ్గాడు. ఆ తర్వాత మరో భారత కెప్టెన్ ఇలా చేయలేకపోయాడు. తాజాగా శ్రేయస్ అయ్యర్ ఈ ఘనతను అందుకున్నాడు. అయితే భారత కెప్టెన్‌గా ఇప్పటి వరకు ఒక్క మ్యాచ్‌లో కూడా విజయం సాధించలేకపోయాడు. టి20 సిరీస్‌లో ఘోర ఓటమి తర్వాత భారత జట్టు వన్డే సిరీస్‌కు సిద్ధమైంది. మంగళవారం నుంచి ఆరంభమయ్యే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో ఇంగ్లండ్‌ను ఎదుర్కోనుంది. అయితే ఈ సిరీస్ కోసం రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జస్ ప్రీత్ బుమ్రా, శుబ్‌మన్ గిల్‌లు భారత జట్టులోకి రానున్నారు. వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్ కోసం ఈ సిరీస్‌తో సన్నాహకాలు ఆరంభం కానున్నాయి. రోహిత్ శర్మ, కోహ్లీలు ఎంట్రీ ఇవ్వడంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొని ఉంది. ఈ మూడు వన్డేల్లో భారత్ గెలుస్తుందో.. లేదంటే టి20 సిరీస్ ప్రదర్శననే కొనసాగిస్తుందో చూడాలి.

# యువ ఫుట్‌బాల్ మ్యాచ్‌ల్లో భారత క్లబ్‌లు అద్భుత ప్రదర్శన

## • పంజాబ్ ఎఫ్‌సీకి 5-0 భారీ విజయం




జపాన్‌లో జరుగుతున్న యువ ఫుట్‌బాల్ మ్యాచ్‌లలో భారత అభివృద్ధి జట్లు (డెవలప్‌మెంట్ స్క్వాడ్స్) ఆకట్టుకునే ప్రదర్శన కనబర్చాయి. జూలై 14, 2027న కురాటే (జపాన్) వేదికగా జరిగిన పోటీల్లో భారత క్లబ్‌లు జపాన్ జే-లీగ్‌కు చెందిన జట్లతో తలపడగా, రెండు జట్లు విజయాలు నమోదు చేయగా, మరో జట్టు తృటిలో ఓటమి చవిచూసింది. రోజంతా జరిగిన మ్యాచ్‌ల్లో అత్యంత ఏకపక్ష విజయాన్ని పంజాబ్ ఎఫ్‌సీ నమోదు చేసింది. అవిస్పా ఫుకుఓకాపై 5-0 తేడాతో ఘన విజయం సాధించి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. మ్యాచ్ ప్రారంభమైన మూడు నిమిషాల్లోనే సింగమయుమ్ షామి తొలి గోల్ నమోదు చేయగా, 28వ నిమిషంలో మరోసారి గోల్ చేసి జట్టుకు బలమైన ఆధిక్యం అందించాడు. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి 42వ నిమిషంలో ఒమాంగ్ డోడుమ్ మరో గోల్ సాధించాడు. రెండో అర్ధభాగంలో 55వ నిమిషంలో నగారిన్ షైజా స్కోరు పెంచగా, ఇంజరీ టైమ్ (90ం2)లో విశాల్ యాదవ్ ఐదో గోల్ చేసి పంజాబ్ ఎఫ్‌సీ విజయాన్ని మరింత ఘనంగా నిలిపాడు. మరో ఆసక్తికర మ్యాచ్‌లో బెంగళూరు ఎఫ్‌సీ 3-2 తేడాతో గిరావాంజ్ కిటాక్యూషుపై విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో 40వ నిమిషంలో ర్యునోసుకే ఇమై గోల్ చేయడంతో జపాన్ జట్టు ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే రెండో అర్ధభాగంలో బెంగళూరు ఎఫ్‌సీ అద్భుతంగా పుంజుకుంది. 61వ నిమిషంలో రక్షిత్ రక్షిత్ ప్రియా అనిల్ సమం చేసే గోల్ నమోదు చేశాడు. ఒక స్వీయ గోల్ కారణంగా మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారినప్పటికీ, 75వ నిమిషంలో సెర్టో వోర్నీలెన్ కోమ్ కీలక గోల్ సాధించాడు. చివరి నిమిషాల్లో జట్టు సమిష్టి రక్షణ ఆకట్టుకోగా, 90వ నిమిషంలో ఎండీ అర్బాష్ గోల్ చేసినప్పటికీ బెంగళూరు ఎఫ్‌సీ విజయాన్ని కాపాడుకుంది. మరో మ్యాచ్‌లో ఎఫ్‌సీ గోవా జపాన్‌కు చెందిన సాగన్ టోసుతో హోరాహోరీగా పోరాడినా 1-0 తేడాతో ఓటమి పాలైంది. మ్యాచ్ ఆరో నిమిషంలోనే జెన్‌ర్యు ఓనో చేసిన గోల్ ఆతిథ్య జట్టుకు విజయాన్ని అందించింది. ఆ తర్వాత ఎక్కువసేపు బంతిపై ఆధిపత్యం ప్రదర్శించిన గోవా, రెండో అర్ధభాగంలో పలు అవకాశాలు సృష్టించినా వాటిని గోల్స్‌గా మలచలేకపోయింది. జపాన్ జట్టు క్రమశిక్షణతో కూడిన రక్షణను ఛేదించడంలో విఫలమవడంతో గోవా ఖాళీ చేతులతో మ్యాచ్ ముగించింది.

# రెండో వన్డేలో విండీస్‌ను ఓడించిన న్యూజిలాండ్



రెండో మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై ఐదు వికెట్ల తేడాతో గెలిచిన న్యూజిలాండ్ ఐదు వన్డేల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. కివీస్ ఎడమచేతి వాటం స్పిన్నర్ జేడెన్ లెనాక్స్ అద్భుత ప్రదర్శనతో వెస్టిండీస్ కుప్పకూలింది. లెనాక్స్ 19 పరుగులు ఇచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. దీంతో కరేబియన్ జట్టు 138 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం న్యూజిలాండ్ 104 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. వెస్టిండీస్‌లోని గయానా వేదికగా జరిగిన మ్యాచ్‌లో తొలుత వెస్టిండీస్ బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లు రాణించడంతో విండీస్ ఓ దశలో 10.3 ఓవర్లకు 63/0తో నిలిచింది. ఇక్కడే అసలు కథ మొదలైంది. లెనాక్స్ అద్భుతమైన బౌలింగ్‌తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. 8 ఓవర్లలో 19 రన్స్ ఇచ్చి.. 5 వికెట్లు తీశాడు. దీంతో ఆతిథ్య జట్టు కేవలం 75 పరుగుల వ్యవధిలో 10 వికెట్లు కోల్పోయి 138 పరుగులకే ఆలౌట్ అయింది. వెస్టిండీస్ బ్యాటర్లలో జాన్ క్యాంప్‌బెల్ 43 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. వెస్టిండీస్ కేవలం 10 ఓవర్లలోనే తమ చివరి 5 వికెట్లు కోల్పోయింది. 31 ఏళ్ల వయసులో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన లెనాక్స్.. తన ఏడో వన్డేలో కెరీర్‌లో తొలిసారిగా ఐదు వికెట్ల ప్రదర్శనను నమోదు చేశాడు. ఎనిమిది ఓవర్లలో 19 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. దీంతో వన్డే క్రికెట్‌లో న్యూజిలాండ్ స్పిన్నర్లలో మూడో అత్యుత్తమ బెస్ట్ నమోదు చేశాడు. ఎక్కువగా టర్న్ అవుతున్న పిచ్‌పై న్యూజిలాండ్ బ్యాటర్లు కూడా ఇబ్బంది పడ్డారు. 96 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది కివీస్. ఈ సమయంలో టామ్ లాథమ్ 37 రన్స్‌తో అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. మైకెల్ బ్రేస్ వెల్ (24) కూడా రాణించడంతో న్యూజిలాండ్.. 32.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి.. ఛేజ్ పూర్తి చేసింది. వన్డే అంతర్జాతీయ మ్యాచ్‌లలో న్యూజిలాండ్‌కు ఇది 400వ విజయం కావడం గమనార్హం. ఐదు మ్యాచుల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో వెస్టిండీస్ ఏడు వికెట్ల తేడాతో గెలుపొందగా, న్యూజిలాండ్ తాజా విజయంతో సిరీస్ 1-1తో సమమైంది. మూడో వన్డే జులై 17న గయానా వేదికగా జరగనుంది. గయానా వేదికగా జరిగిన రెండో వన్డేలో వెస్టిండీస్‌పై న్యూజిలాండ్ ఐదు వికెట్ల తేడాతో గెలుపొందింది. కివీస్ స్పిన్నర్ ఐదు వికెట్లతో చెలరేగడంతో ఈ మ్యాచ్ గురించి తెలుసుకోవడానికి భారత క్రికెట్ అభిమానులు ఆసక్తి కనబర్చారు. దీంతో కీవర్డ్ 2 లక్షలకుపైగా సెర్చ్ వాల్యూమ్‌తో గూగుల్ ట్రెండ్స్‌లో టాప్‌లో నిలిచింది.

# ఇంగ్లాండ్ నయా ఓపెనర్‌గా జాకబ్ బెథెల్ ప్రమోషన్..

ఇండియా, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరగబోయే త్రీ-మ్యాచ్ వన్డే సిరీస్ కోసం క్రేజీ సమరానికి టైమ్ ఫిక్స్ అయింది. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా మంగళవారం జరగబోయే ఫస్ట్ వన్డే మ్యాచ్ కోసం హోస్ట్ టీమ్ ఇంగ్లాండ్ తమ స్ట్రాంగ్ ప్లేయింగ్ ఎలెవన్ ను అఫీషియల్ గా అనౌన్స్ చేసింది. ఈ మ్యాచ్ లో యంగ్ అండ్ డైనమిక్ ఆల్‌రౌండర్ జాకబ్ బెథెల్, సీనియర్ బ్యాటర్ బెన్ డకెట్‌తో కలిసి ఓపెనర్ గా బరిలోకి దిగబోతున్నట్లు మేనేజ్‌మెంట్ కన్ఫర్మ్ చేసింది. ఈ మ్యాచ్ ఇంగ్లాండ్ స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ జోస్ బట్లర్ కెరీర్ లో ఒక మైండ్ బ్లాకింగ్ పర్సనల్ మైల్‌స్టోన్ గా నిలవబోతోంది. బట్లర్ తన ఇంటర్నేషనల్ కెరీర్ లో 200వ వన్డే మ్యాచ్ ఆడబోతున్నాడు. ఇంగ్లాండ్ వైట్ బాల్ సెటప్ లో మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్ అయిన జోస్ బట్లర్, ఫిబ్రవరి 21, 2012 న దుబాయ్ వేదికగా పాకిస్తాన్‌పై తన ఫస్ట్ వన్డే డెబ్యూ ఇచ్చాడు. అప్పటి నుంచి ప్రెజెంట్ వరకు వన్డే ఫార్మాట్ లో 39.11 యావరేజ్ తో ఏకంగా 5,515 రన్స్ స్కోర్ చేశాడు. ఇందులో 11 సెంచరీలు, 29 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

టీ20 సిరీస్ ను 4-0 తో క్లీన్ స్వీప్ చేసిన జోష్ లో ఉన్న ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్, లాస్ట్ నవంబర్ తర్వాత ఫస్ట్ టైమ్ వన్డే సెటప్ లోకి గ్రాండ్ గా కంబ్యాక్ ఇచ్చాడు. ఆర్చర్ తో పాటు జోష్ టంగ్ పేస్ బాధ్యతలు చూసుకోనుండటంతో గస్ అట్కిన్సన్ కు ప్లేయింగ్ ఎలెవన్ లో ప్లేస్ దక్కలేదు. ఎడ్జ్‌బాస్టన్ మ్యాచ్ తర్వాత కార్డిఫ్ (జూలై 16), లార్డ్స్ (జూలై 19) వేదికల్లో మిగతా మ్యాచులు జరగనున్నాయి. ఫస్ట్ వన్డే కోసం ఇంగ్లాండ్ అఫీషియల్ స్క్వాడ్ లో జాకబ్ బెథెల్, బెన్ డకెట్, జో రూట్, హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జోస్ బట్లర్ (వికెట్ కీపర్), సామ్ కరన్, విల్ జాక్స్, జోఫ్రా ఆర్చర్, లియామ్ డాసన్, జోష్ టంగ్, అదిల్ రషీద్ బరిలోకి దిగుతున్నారు.




# వేంకటేశ్వర స్వామిగా రాజేంద్రప్రసాద్

రాజేందప్రసాద్, శ్రీకాంత్ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం 'మిస్టర్ మిడిల్ క్లాస్' . జి.నాగేశ్వరరావు దర్శకత్వం వహించిన ఈ సినిమా జులై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో వేంకటేశ్వర స్వామిగా రాజేందప్రసాద్ నటించగా.. భక్తుడిగా శ్రీకాంత్ కనిపించనున్నారు.

-------

# రావ్ బహద్దూర్ అందరూ చూడాల్సిన మూవీ

## ప్రశంసలు కురిపించిన దర్శకుడు సందీప్ వంగా



ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఇటీవలే విడుదలైన 'రావ్ బహదూర్' చిత్రంపై ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా చూసిన అనంతరం ఆయన సోషల్ మీడియా వేదికగా తన రివ్యూను పంచుకున్నారు. సినిమాను గొప్పగా తీసిన చిత్ర బృందాన్ని అభినందించారు. మనం సినిమాను ఎందుకు అంతగా ప్రేమిస్తామో మరోసారి గుర్తుచేసే అరుదైన చిత్రాల్లో 'రావు బహదూర్' ఒకటి. సినిమా ప్రేమికుడికి నాదొక చిన్న విన్నపం.. మీ జీవితంలోని మూడు గంటల సమయాన్ని 'రావ్ బహదూర్'కు ఇవ్వండి. కచ్చితంగా మీకు నచ్చుతుంది. అన్ని ప్రశంసలు అందుకునేందుకు దీనికి పూర్తి అర్హత ఉంది. వెంకటేశ్ మహా తక్కువ బ్జడెట్‌లో అద్భుతంగా రూపొందించారు. ఎంతో ధైర్యం, తనపై తనకు బలమైన నమ్మకం ఉన్న వాళ్లు మాత్రమే ఇలా తెరకెక్కించగలరు. ఇక సత్యదేవ్ తన నటనతో అదరగొట్టారు. ఇందులో ఎలాంటి అనవసరమైన హడావుడి లేదు, షార్ట్‌కట్‌లు లేవు. కేవలం స్వచ్ఛమైన కథ మాత్రమే కనిపిస్తుంది' అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇలాంటి సినిమాలను కచ్చితంగా సెలబ్రేట్ చేసుకోవాలని అన్నారు.

----------

# తదుపరి ప్రాజెక్టులపై నాగచైతన్య దృష్టి

## సోషల్ మీడియా ప్రచారాలను తిప్పికొట్టిన టీమ్




అక్కినేని నాగచైతన్య తదుపరి ప్రాజెక్టులపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు వైరల్ అవుతున్నాయి. అధికారిక ప్రకటన ఏదీ లేకపోయినా, ఆయన కొత్త సినిమాల లైనప్ గురించి ఎంటర్‌టైన్‌మెంట్ పేజీలు, సినీ వర్గాలకు చెందిన సోషల్ మీడియా ఖాతాల్లో వరుస పోస్టులు దర్శనమివ్వ డంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ఇద్దరు కొత్త దర్శకులతో చైతన్య సినిమాలు చేయబోతున్నారనే ప్రచారం హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం 'వృషకర్మ' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న నాగచైతన్య, ఆ తర్వాత పూర్తిస్థాయి హారర్ థ్రిల్లర్‌లో నటించనున్నట్లు ప్రచారం జరిగింది. మసూద చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సాయి కిరణ్ చెప్పిన కథను చైతన్య ఇప్పటికే విన్నారని, ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ బ్యానర్‌పై ఈ సినిమా రూపొందే అవకాశం ఉందని వార్తలు చక్కర్లు కొట్టాయి. కథ నచ్చడంతో కేవలం తుది నిర్ణయం మాత్రమే మిగిలి ఉందని కూడా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అంతేకాకుండా బెదురులంక దర్శకుడు క్లాక్స్ దర్శకత్వంలోనూ నాగచైతన్య ఓ కొత్త కాన్సెప్ట్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే వార్తలు కూడా వైరల్ అయ్యాయి. 'వృషకర్మ' షూటింగ్ పూర్తయ్యాక ఈ ఏడాది చివర్లో ఆ సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశముందని పలు కథనాలు పేర్కొన్నాయి. వరుసగా ఇద్దరు కొత్త తరహా దర్శకుల పేర్లు వినిపించడంతో అభిమానులు ఈ ప్రాజెక్టులపై ఆసక్తి చూపడం ప్రారంభించారు. అయితే సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ ప్రచారానికి నాగచైతన్య టీమ్ స్పష్టత ఇచ్చింది. మసూద దర్శకుడు సాయి కిరణ్‌తో సినిమా ఖరారైందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని వెల్లడించింది. ఇప్పటివరకు ఇద్దరి మధ్య స్క్రిప్ట్ చర్చలు గానీ, అధికారిక సమావేశాలు గానీ జరగలేదని స్పష్టం చేసినట్లు సమాచారం. అలాగే క్లాక్స్‌తో సినిమా విషయంలో కూడా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కొత్త దర్శకుల నుంచి కథలు వింటున్న మాట నిజమే అయినప్పటికీ, ఏ ప్రాజెక్ట్‌కూ ఇంకా తుది ఆమోదం ఇవ్వలేదని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

# తుంబాడ్-2 లో ఆలియా



భారతీయ చలనచిత్ర రంగంలో అద్భుతమైన విజువల్స్, అద్భుతమైన కథాంశంతో కల్ట్ క్లాసిక్‌గా నిలిచిన హారర్ థ్రిల్లర్ చిత్రం 'తుంబాడ్'. ఈ సినిమా సీక్వెల్ 'తుంబాడ్ 2' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా, ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించి చిత్ర పరిశ్రమలో ఒక భారీ సంచలన అప్‌డేట్ వెలువడింది. బాలీవుడ్ స్టార్ నటి ఆలియా భట్ అధికారికంగా 'తుంబాడ్ 2' చిత్రబృందంలో చేరింది. ఈ విషయాన్ని సినిమా హీరో మరియు నిర్మాత సోహుమ్ షా సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడిస్తూ ఆలియాకు ఘన స్వాగతం పలికారు. ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది.. 'తుంబాడ్ 2' లోకి స్వాగతం ఆలియా భట్. ప్రళయం రాబోతోంది' అంటూ సోహుమ్ షా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఆలియాతో దిగిన ఫోటోలను పంచుకున్నారు. ఈ సినిమాలో భాగం కావడంపై ఆలియా భట్ సైతం హర్షం వ్యక్తం చేసింది. తాను మొదటిసారి 'తుంబాడ్' చూసినప్పటి నుంచి ఆ చిత్రం తన మనసులోనే ఉండిపోయిందని, ఇంతటి ప్రత్యేకమైన ప్రపంచంలోకి అడుగుపెట్టడం చాలా సంతోషంగా ఉందని ఆమె పేర్కొంది. సోహుమ్ షా, నవాజుద్దీన్ సిద్ధిఖీ వంటి అద్భుతమైన నటులతో కలిసి పనిచేయడానికి తాను ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు తెలిపింది. ఇక 'తుంబాడ్ 2' లో ఆలియా భట్ పాత్ర కేవలం అతిథి పాత్రగా కాకుండా కథను మలుపు తిప్పే కీలకమైన రోల్‌గా ఉండబోతోంది. దాదాపు రూ.100 కోట్ల భారీ బ్జడెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ సీక్వెల్‌కు ఆదేశ్ ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 3, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



----

# తండ్రి విజయ్ కోసం సంజయ్ త్యాగం

## జననాయగన్ కోసం సిగ్మా మూవీ వాయిదా




విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ 'సిగ్మా'తో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విజయ్ సినిమా కోసం సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. 'జన నాయగన్' జులై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఏడు నెలల నిరీక్షణ అనంతరం వస్తోన్న ఈ సినిమా కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. దీనికి లైన్ క్లియర్ చేయడం కోసం సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకుంటున్నారని సమాచారం.సందీప్ కిషన్ కథానాయకుడిగా రూపొందిన 'సిగ్మా' చిత్రాన్ని జులై 31న విడుదల చేయాలని మొదట భావించారు. 'జన నాయగన్' జులై చివరి వారంలో వస్తుండటంతో.. ఈ సినిమా విడుదలను ఆగస్టుకు వాయిదా వేసినట్లు సమాచారం. గతంలో సంజయ్ ఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. ఇది తన జీవితంలో ఎంతో ప్రత్యేకమైన సినిమా అని చెప్పారు. ఆగస్టులో పెద్ద సినిమాలేవీ లేకపోవడంతో అప్పుడు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక అప్‌డేట్ రావాల్సి ఉంది. ఇక విజయ్ కుమారుడు సంజయ్‌కు సంబంధించిన మరో వార్త కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేవలం దర్శకుడిగానే కాకుండా త్వరలోనే నటుడిగా కూడా వెండితెరకు పరిచయం కానున్నట్లు సమాచారం. ప్రముఖ నిర్మాత జీకేఎమ్ తమిళ్ కుమారన్ తన సొంత బ్యానర్‌పై సంజయ్‌ను హీరోగా పరిచయం చేయనున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. విజయ్ సినిమాల నుంచి వైదొలగిన నేపథ్యంలో ఆయన కుమారుడు వెండితెరకు పరిచయం కానున్నట్లు వార్తలు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# 'తెలుగు సినిమా.. హిందీ సినిమా' ఇదేం విభజన? - అడివి శేష్



భాషల ఆధారంగా సినిమాలను విభజించే విధానంలో మార్పు రావాల్సిన సమయం ఆసన్నమైందని హీరో అడివి శేష్ అభిప్రాయపడ్డాడు. దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునే సినిమాలను ఒకే భాషకు పరిమితం చేయడం సరైన విధానం కాదన్నాడు. దేశమంతా ఆదరించే కథలకు భాష అడ్డంకిగా మారకూడదని అభిప్రాయపడ్డాడు.ఇప్పటికీ 'హిందీ సినిమా', 'తెలుగు సినిమా', 'తమిళ సినిమా' అంటూ వేర్వేరుగా పిలుస్తూనే, మరోవైపు 'పాన్ ఇండియా సినిమా' అనే పదాన్ని ఉపయోగించడం ఆసక్తికరంగా అనిపిస్తోందని శేష్ చెప్పాడు. ఒక సినిమా దేశవ్యాప్తంగా ప్రేక్షకులతో భావోద్వేగ అనుబంధాన్ని ఏర్పరచగలిగితే దాని గుర్తింపును భాషతో ఎందుకు పరిమితం చేయాలని ప్రశ్నించాడు. కథలను భాషల గీతల్లో కాకుండా భారతీయ కథలుగా స్వీకరించినప్పుడే నిజమైన పాన్ ఇండియా సినిమా ఆవిష్కృతమవుతుందని అన్నాడు.

భాష అనేది భావాలను వ్యక్తీకరించే సాధనం మాత్రమేనని, అది ఎప్పుడూ పరిమితిగా మారకూడదని అడివి శేష్ పేర్కొన్నాడు. ఇప్పుడు ప్రేక్షకులు గతంతో పోలిస్తే ఎంతో మారిపోయారని చెప్పాడు. మంచి కథ ఎక్కడి నుంచి వచ్చినా ఆదరిస్తున్నారని, ప్రేక్షకుల ఆలోచనా విధానానికి తగ్గట్టు సినీ పరిశ్రమ కూడా మారాల్సిన అవసరం ఉందన్నాడు.సినీ సృష్టికర్తల బాధ్యత నిజాయతీతో కూడిన కథలను అందరికీ చేరేలా రూపొందించడమేనని శేష్ అన్నాడు. ఒక భాష మార్కెట్‌ను మాత్రమే లక్ష్యంగా పెట్టుకోకుండా దేశం మొత్తం సొంతం చేసుకునే సినిమాలను రూపొందించాలన్నదే తమ లక్ష్యమని చెప్పాడు.ప్రస్తుతం అడివి శేష్ నటించిన 'డెకాయిట్: ఏ లవ్ స్టోరీ' విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటించింది. అనురాగ్ కశ్యప్, ప్రకాశ్‌రాజ్, సునీల్, జైన్ మేరీ ఖాన్, అతుల్ కులకర్ణి కీలక పాత్రలు పోషించారు. అలాగే 'గూఢచారి'కి సీక్వెల్‌గా తెరకెక్కుతున్న 'జీ2' చిత్రంలో కూడా అడివి శేష్ నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, వామికా, మధు శాలిని ఇతర ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com